బుధవారం
21-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 61
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇక జన్ పోషణ్ కేంద్రాలు

న్యూదిల్లీ: రేషన్ దుకాణాలను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చే కార్యక్రమం ప్రారంభమైంది. డీలర్ల ఆదాయం పెంపుదలే లక్ష్యంగా ఇందుకు శ్రీకారంచుట్టినట్లు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ప్రయోగాత్మకంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లోని 60 రేషన్ షాపులను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చనున్నట్లు వెల్లడించారు. రేషన్ దుకాణాల కార్యకలాపాలు ఆధునీకరించనున్నారు. దుకాణాల్లో తృణధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, రోజువారీ నిత్యవసర సరుకులు అందుబాటులో వస్తాయి. ఎఫ్ఎమ్‌సీజీ విభాగంలో 3,500 ఉత్పత్తులు విక్రయించనున్నారు. మేరా రేషన్ యాప్ అప్‌గ్రేడ్ వెర్షన్‌ను పరిచయం చేశారు.

నేడు భారత్ బంద్

న్యూదిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం భారత్ బంద్‌కు రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి పిలుపునిచ్చింది. సుప్రీంకోర్టు తన తీర్పును ఉపసంహరించుకోవాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. దీంతో శాంతి భద్రతల సమస్య రాకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్ బంద్ పిలుపుతో అనేక రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందస్తు చర్యలు

- మిగతా 2 లో

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ 20 ప్రెస్‌మీట్లు

న్యూదిల్లీ: అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ ఆరోపణలతో అదానీ, సెబీపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇదే క్రమంలో బుధవారం దేశవ్యాప్తంగా 20 విలేకరుల సమావేశాలు నిర్వహించబోతోంది. హిండెన్‌బర్గ్ నివేదిక బయట పెట్టినది కొన మాత్రమేనని, లోతైన విచారణతో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఏర్కొంది. అందుకోసమే జేపీసీతో

- మిగతా 2 లో

స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: గ్రామాల అభివృద్ధితోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి అన్న మహాత్మా గాంధీ ఆశయాలకను గుణంగా స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రూ. 1452 కోట్ల నిధులు విడుదల చేసినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, దీనిని సరిచేసేందుకు ప్రజా

- మిగతా 2 లో

కోల్‌కతా హత్యాచార ఘటన

భయంకరం

ఎఫ్ఐఆర్ నమోదుపై జాప్యం దేనికి? | **పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం**

- రేపటి లోగా పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశం
- వైద్యుల భద్రత కోసం టాస్క్‌ఫోర్స్

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనను భయంకరమైన చర్యగా సుప్రీం కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంలో జాప్యం జరగడంపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఎఫ్ఐఆర్ ఎందుకు ఆలస్యంగా నమోదు చేశారని ప్రశ్నించింది. బెంగాల్ ప్రభుత్వం, ఆసుపత్రి అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడింది. బాధితురాలి వీడియోలు, ఫోటోలు బయటకు రావటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా మహిళలు, యువ వైద్యుల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో ఈనెల 22లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అలాగే నిరసన వ్యక్తంచేస్తోన్న వైద్యులు తిరిగి విధుల్లోకి రావాలని ఈసందర్భంగా కోరింది. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఘటన జరిగిన ఆర్‌జీ కార్ ఆసుపత్రి వద్ద భద్రత కల్పించాలని ఆదేశించింది. ఇక దేశవ్యాప్తంగా డాక్టర్లు, మహిళల రక్షణకు జాతీయ స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

- మిగతా 2 లో

భగ్గుమన్న తాడిపత్రి

- పెద్దారెడ్డి రాకతో ఉద్రిక్తత
- వైసీపీనేత ఇంటిపై టీడీపీ వర్గీయుల దాడి

విశాలాంధ్ర–తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టీడీపీ, వైసీపీ వర్గీయుల ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఫలితాల తర్వాత తాడిపత్రిలో అల్లర్లు చెలరేగాయి. ఇటీవల కాస్త సద్దుమణిగిన తాడిపత్రి... మంగళవారం సాయంత్రం భగ్గుమంది. టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం దాడులు చేసుకున్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి రావడంతో వైసీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తమను రెచ్చగొట్టారంటూ టీడీపీ కార్యకర్తలు వైసీపీ నేత రఫీపై దాడి చేశారు. ఈ ఘర్షణలో వైసీపీ నేత మురళీ ప్రసాద్ రెడ్డి గన్ తో హల్‌చల్ చేశారు. గన్ బయటికి తీసిన కాల్చి పడేస్తానంటూ బెదిరింపులకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ నేత కందిగోపుల మురళి ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి ఫర్నిచర్, వాహనాలు ధ్వంసం చేశారు. ఆయన ఇంటికి నిప్పుపెట్టారు. పోలీసులు చేరుకునేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మురళి ఇల్లు దాదాపుగా అగ్నికి ఆహుతైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. పరిస్థితి మరింత

- మిగతా 2 లో

పల్లెల్లో మళ్లీ వెలుగులు

- జనవరి నుంచి జన్మభూమి 2.0 అమలు
- ప్రతి ఊరికి మౌలిక సదుపాయాలు
- రాబోయే ఐదేళ్లలో 17,500 కి.మీ సీసీ రోడ్లు
- పంచాయతీరాజ్ శాఖ సమీక్షలో చంద్రబాబు, పవన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 2014-19 మధ్య వివిధ కార్యక్రమాల ద్వారా గ్రామాల రూపు రేఖలు మార్చితే... గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసి గ్రామాలను సమస్యలకు కేంద్రాలుగా మార్చిందని సీఎం విమర్శించారు. మళ్లీ గ్రామాల్లో వెలుగు తెచ్చేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు పంచాయతీరాజ్ శాఖకు జవసత్వాలు అందిస్తామన్నారు. ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏమి అవసరమో గుర్తించి... ఆ మేరకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇంటికి అవసరమైన విద్యుత్, గ్యాస్, టాయిలెట్, నీటి కుళాయి వంటి సౌకర్యాలతోపాటు గ్రామానికి అవసరమైన వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు, సిమెంటు రోడ్లు, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాల వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. గ్రామం నుంచి సమీప ప్రాంతాల అనుసంధానం కోసం రోడ్లు, మార్కెట్ స్థలాలు వంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. వీటిని కూడా కనీస అవసరాలుగా గుర్తించి అందించేందుకు పంచాయతీ రాజ్ శాఖ సమగ్ర ప్రణాళికతో రానున్నరోజుల్లో పనిచేయాలని సూచించారు. వచ్చే జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నామని, గ్రామాల అభివృద్ధికి ముందుకు వచ్చే వారితో కలిసి పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నామని సీఎం తెలిపారు. సచివాలయంలో మంగళవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అటవీ శాఖలపై సీఎం సమీక్ష చేశారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాబోయే ఐదేళ్లలో 17,500 కిమీ సీసీ రోడ్ల నిర్మాణం

సమావేశంలో ముఖ్యమంత్రి వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం తీరుతో గ్రామాల్లో ఖర్చు చేయాల్సిన నిధులు దారి మళ్లాయి. దీనివల్ల కనీస స్థాయిలో కూడా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీళ్లు అందించేందుకు కేంద్రం తీసుకొచ్చిన జలజీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం ఉపయోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. జలజీవన్ మిషన్ పనుల్లో రాష్ట్రం 19వ స్థానానికి దిగజారిపోయిందంటే నాటి ప్రభుత్వ అలసత్వానికి ఉదాహరణ. కేంద్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. రాబోయే ఐదు సంవత్సరాల్లో 17,500 కిలో మీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణం, 10 వేల కి.మీ సీసీ డ్రైనేజీ కాలవల నిర్మాణం జరిపేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ పనుల పూర్తికి ఎంత సమయం పడుతుంది. ఏడాదికి ఎంతమేర పనులు చేయగలరు అనేది లక్ష్యంగా నిర్దేశించుకుని వెళ్లాలని సీఎం సూచించారు. గ్రామాల్లో చేపట్టే నరేగా పనులపై ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని, కొత్త వ్యవస్థలు వచ్చినా గ్రామ సర్పంచ్‌ను గౌరవించుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ తీరువల్ల మూలనపడ్డ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను పునఃప్రారంభించాలని ఆదేశించారు. 'రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపుపై దృష్టి పెట్టి, నగర వనం కార్యక్రమం ద్వారా 175 నియోజకవర్గాల్లో,

- మిగతా 2 లో

తలొంచిన కేంద్రం

లేటరల్ ఎంట్రీ ఉద్యోగ ప్రకటనల రద్దుకు ఆదేశం

యూపీఎస్‌సీకి లేఖ రాసిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూదిల్లీ : ప్రైవేటు (లేటరల్ ఎంట్రీ) విధానం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లోని ఖాళీల భర్తీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కేంద్రంలోని 45 కీలక పదవుల్లోకి కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు వారిని నియమించడానికి యూపీఎస్సీ జారీ చేసిన 'లేటరల్ ఎంట్రీ' ప్రకటన వివాదాస్పదమైంది. ఈ ప్రకటనను ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రిజర్వేషన్లను లాక్కునే కుట్ర అంటూ ధ్వజమెత్తాయి. అలాగే ఆ నియామక విధానాన్ని ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలు కూడా తప్పుపట్టాయి. ఉద్యోగాల ప్రకటనలో రిజర్వేషన్‌పై గొడవల నడుమ... తాజా లేటరల్ ఎంట్రీ నియామక ప్రకటనలను రద్దు చేయాలని కేంద్రం మంగళవారం యూపీఎస్‌సీని కోరింది. కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) చైర్మన్ ప్రీతి సూదన్‌కు లేఖ రాశారు. అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ సేవల్లో సరైన ప్రాతినిధ్యం లభించేలా ప్రకటనను రద్దు చేయాలని కోరారు. ఈ అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. యూపీఎస్‌సీ ఆగస్టు 17న 45 మంది సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, డిప్యూటీ కార్యదర్శులను లేటరల్ ఎంట్రీ ద్వారా నియమించడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ శాఖలలో నిపుణుల నియామకం (ప్రైవేట్ రంగానికి చెందిన వారితో సహా) గా ఇది సూచిస్తుంది. ఈ నిర్ణయం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ హక్కులను అణగదొక్కిందని పేర్కొంటూ ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలను రేకెత్తించింది. చారిత్రక అన్యాయాలను పరిష్కరించడం, చేరికను ప్రోత్సహించే

- మిగతా 2 లో

బీజేపీ కుట్ర భగ్నం

- కులగణనతో సామాజిక న్యాయం: రాహుల్
- రాజ్యాంగశక్తితో నియంతృత్వ పాలనకు ఓటమి: ఖర్గే

న్యూదిల్లీ: రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాంగ్రెస్ పరిరక్షిస్తుందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ సహా విపక్ష ఇండి యా ఐక్యసంఘటన పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో లేటరల్ ఎంట్రీ విధానంపై కేంద్రప్రభుత్వం వెనకడుగు వేసింది. దీని ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఇచ్చిన ప్రకటనను రద్దు చేయాలంటూ యూపీఎస్సీకి కేంద్రం లేఖ రాసిన క్రమంలో దీనిపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ వ్యవస్థను అన్నివిధాలా పరిరక్షిస్తాం. లేటరల్ ఎంట్రీ వంటి బీజేపీ కుయత్నాలను అడ్డుకుంటాం. మళ్లీ చెబుతున్నా... 50% రిజర్వేషన్ పరిమితిని

- మిగతా 2 లో

చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తి

ఇస్రో చైర్మన్

న్యూదిల్లీ: చంద్రయాన్ ప్రాజెక్టుకు సంబంధించిన సరికొత్త సమాచారాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. చంద్రుడి మీదకు వరుసగా వ్యోమనౌకలు పంపినట్లు చెప్పిన ఆయన... చంద్రయాన్ 3 విజయవంతమైనట్లు తెలిపారు. ప్రస్తుతం చంద్రయాన్ 4, 5 ప్రాజెక్టు డిజైన్లు పూర్తయ్యాయని, ఆ డిజైన్లకు ప్రభుత్వం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు ఇస్రో చైర్మెన్ తెలిపారు. ఎల్‌వీఎం3 రాకెట్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సార్సార్.. కాపాడండి సార్!

అధికారుల కలవరం

- మధుసూదన్ రెడ్డిపై వేటు ప్రభావం
- అవినీతి ఆరోపణలపై కూటమి ప్రభుత్వం చర్యలు
- ప్రవీణ్ ప్రకాశ్ మళ్లీ వెనక్కి?
- సీఎంతో భేటీకి ప్రయత్నాలు!

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : గత ప్రభుత్వ హయాంలో అవినీతి ఆరోపణలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. నేతల ఒక్కొక్కరి అవినీతిని వెలికితీస్తూ, వారిపై సమగ్ర విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఐఏఎస్, ఐపీఎస్‌ల పైనా ప్రభుత్వం ప్రధాన దృష్టి కేంద్రీకరించింది. పనిచేసిన వారిని, సమర్థవంతంగా విధులు నిర్వహించిన వారికి ఉన్నత స్థాయి పదవులు కేటాయించడం, మిగిలిన వారిని లూప్‌లైన్‌కు పంపడం ప్రభుత్వాలు సాధారణంగా చేస్తుంటాయి. దాంతోపాటు కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్ర సర్వీసులకు వచ్చిన వారంతా ప్రభుత్వాలు మారడంతో రిలీవ్ కోరగా, అందుకు అనుమతిస్తుంటాయి. అలాంటి అవకాశాలకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చెక్‌పెట్టింది. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు ఇతర కేంద్ర సర్వీసుల నుంచి ఎవ్వరు వచ్చినా... వారిని తమ అనుమతి లేకుండా జాయిన్ చేసుకోవద్దని నిబంధన విధించింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఉండటంతో ఇక అవినీతి ఆరోపణలు, ఏకపక్షంగా వ్యవహరించిన అధికారుల్లో ఎవ్వరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితి నెలకొంది. తాజాగా ఫైబర్‌నెట్ ఎండీగా పని చేసిన మధుసూదన్ రెడ్డిపై వేటు పడటంతో మిగిలిన అధికారుల్లో కలవరం మొదలైంది. ఆయన డిప్యుటేషన్ కాలం ముగిసే ఒక రోజు ముందే చర్యలకు ఉపక్రమించడం చర్చనీయాంశమైంది. దానికితోడు మరో ఆర్నెళ్లపాటు మధుసూదన్ రెడ్డి పదవీకాలం

- మిగతా 2 లో

వైద్య సిబ్బంది పరిరక్షణకు చట్టం

కోల్‌కతా డాక్టర్ దోషులకు కఠిన శిక్ష: సీపీఐ డిమాండ్

న్యూదిల్లీ: హింస నుంచి వైద్యులకు రక్షణ కల్పిస్తూ చట్టం తేవాలని కేంద్రప్రభుత్వాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. వైద్య రంగంలో పనిచేసే మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలని పేర్కొంది. ఇటీవల బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆసుపత్రిలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య యావత్ దేశాన్ని కలచి వేసిందని, దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. హేయమైన నేరాలు, హింస నుంచి మహిళా వైద్యులకు రక్షణ కల్పించేలా చట్టాన్ని చేసే విషయంలో కేంద్రం మరోసారి ఆలోచన చేయాలని సీపీఐ సూచించింది. వైద్యులపై హింసకు వ్యతిరేకంగా చట్టం చేసేందుకు కేంద్రప్రభుత్వ విముఖత దురదృష్టకమని పేర్కొంది. కొన్ని రాష్ట్రాల్లో వైద్యుల పరిరక్షణకు చట్టాలు ఉన్నాయని, కేంద్ర

- మిగతా 2 లో

బందీల మృతదేహాలు లభ్యం: ఇజ్రాయిల్

గాజా: ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదలకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హమాస్ చెరలో ఉన్న వారిలో ఆరుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ వెల్లడించింది. దక్షిణ గాజాలో చేపట్టిన ఓ మిలటరీ ఆపరేషన్‌లో ఈ మృతదేహాలు లభ్యమైనట్లు పేర్కొంది. అయితే, వాళ్లు ఎలా, ఎప్పుడు మరణించారనే విషయం వెల్లడించలేదు. ఇజ్రాయిల్ సైన్యం ఆపరేషన్లపై ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పందిస్తూ బందీలను తిరిగి తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ క్రమంలో భారీగా ప్రాణనష్టం జరగడం తననెంతో బాధిస్తుందన్నారు. ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి అమెరికా, అరబ్ దేశాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయిల్‌లో పర్యటిస్తున్నారు. కాల్పుల విరమణ చర్చలు త్వరలోనే మొదలవుతాయనే వార్తలతో బందీల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ పరిణామం హమాస్‌కు ఎదురుదెబ్బలా కనిపిస్తున్నప్పటికీ... కాల్పుల విరమణ విషయంలో ఇజ్రాయిల్‌పై మరింత ఒత్తిడి పెంచేలా కనిపిస్తోందని తెలుస్తోంది. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై మెరుపు దాడులకు పాల్పడిన హమాస్... దాదాపు 250 మందిని కిడ్నాప్ చేసి, బందీలుగా గాజాకు తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వీరిలో సుమారు 100 మందికిపైగా చర్చల్లో భాగంగా విడుదల చేయగా... మరికొందరు చనిపోయారు. మరో 110 మంది ఇప్పటికీ హమాస్ మిలిటెంట్ల చేతిలో బందీలుగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే, కిడ్నాప్ చేసినప్పుడు సజీవంగా ఉన్నారని బందీల కుటుంబీకుల తరఫున పోరాడుతున్న ఓ సంఘం పేర్కొంటుండగా... ఇజ్రాయిల్ దాడుల్లోనే కొందరికి గాయాలయ్యాని, మరికొందరు మరణించారని హమాస్ చెబుతోంది.

'ఎంపాక్స్' వ్యాప్తి నియంత్రించొచ్చు

డబ్ల్యూహెచ్ఓ

న్యూయార్క్: కరోనా సృష్టించిన కలవరాన్ని మర్చిపోతున్న తరుణంలో తాజాగా ఎంపాక్స్ కలకలం రేపుతోంది. ఆఫ్రికా దాటి అనేక దేశాలకు ఈ వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ ఆందోళన సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన మాట కాస్త ఊరటనిస్తోంది. ఎంపాక్స్... కోవిడ్ కాదని, దాని వ్యాప్తిని నియంత్రించొచ్చని తెలిపింది. డబ్ల్యూహెచ్ఓలో యూరప్ రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హాన్స్ క్లుగే మీడియాతో మాట్లాడుతూ ఎంపాక్స్ వ్యాప్తిని నియంత్రించేందుకు, నిర్మూలించేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమయంలో ప్రపంచం స్పందించే తీరు కీలకమని వ్యాఖ్యానించారు. 'దీనిని ఐక్యంగా ఎదుర్కోవాలి. మనం ఈ వైరస్‌ను నియంత్రిస్తామా... మరోసారి నిర్లక్ష్యం, భయం వైపు వెళ్తామా... అనేది మన స్పందనపై ఆధారపడి ఉంటుంది. రానున్న ఏళ్లలో ఐరోపా, ప్రపంచానికి ఇది మరో పరీక్షే' అని హెచ్చరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం 2022 నుంచి ఇప్పటివరకు 116 దేశాలకు ఎంపాక్స్ వైరస్ విస్తరించింది. మొత్తం 99,176 కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాంగోలో వేగంగా వ్యాపిస్తోంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 15,600 కేసులు నమోదు కాగా 537 మరణాలు సంభవించాయి. భారత్‌లో 2022 నుంచి ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. మార్చి 2024లో చివరి కేసు గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆ తర్వాత దేశంలో ఎటువంటి ఎంపాక్స్ కేసులు కొత్తగా నమోదు కాలేదని తెలిపింది. మరోపక్క పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో నలుగురిలో ఈ వైరస్‌ను గుర్తించారు.

అమెరికా ఎన్నికలపై ఇరాన్ హ్యాకర్ల పంజా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకొనేందుకు ఇరాన్ హ్యాకర్లు యత్నిస్తున్నారని ఎఫ్‌బీఐ అధికారులు వెల్లడించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రచారం హ్యాక్ అవడానికి ఇరాన్ కారణమని తాము విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్‌బీఐ, ఇతర ఏజెన్సీల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ విశ్లేషణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ హ్యాకర్లు కమలా హారిస్ ప్రచార బృందం సమాచారాన్ని కూడా హ్యాక్ చేయాలని యత్నించినట్లు తెలిపారు. సోషల్ ఇంజినీరింగ్, ఇతర ప్రయత్నాల ద్వారా వ్యక్తులను ప్రభావితం చేయాలన్నది ఇరాన్ లక్ష్యంగా కనిపిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డేటా చౌర్యం, కీలక సమాచారం బహిర్గతం చేయడం వంటి చర్యలను దీనికి మార్గంగా ఎంచుకొన్నట్లు చెబుతున్నాయి. ట్రంప్ ప్రచార బృందానికి ఫిషింగ్ ఈ మెయిల్ పంపినట్లు గుర్తించారు. ఇది పూర్తిగా విశ్వసించదగిన వారినుంచి వచ్చినట్లు కనిపించేలా దీనిని డిజైన్ చేశారు. హారిస్ బృందంలోని ముగ్గురు అధికారులకు ఇలాంటి ఈ మెయిల్స్ వచ్చాయి. మరోవైపు, డెమొక్రటిక్, రిపబ్లికన్ బృందాలు ఇప్పటికే తమ సమాచారంపై హ్యాకర్లు దాడులు చేసినట్లు వెల్లడించాయి. అయితే, ఇలాంటి చర్యలు గత ఎన్నికల్లో చోటుచేసుకొన్నట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఐరాసలోని ఇరాన్ ప్రతినిధుల బృందం అమెరికా ఇంటెలిజెన్స్ ఆరోపణలను తోసిపుచ్చింది.

ఇవి ఏమాత్రం ఆధారాలు లేని ఆరోపణలని కొట్టిపారేసింది. అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం తమకు లేదని పేర్కొంది. అమెరికా ఏదైనా ఆధారాలు చూపించి మాట్లాడితే తాము దాని ప్రకారం కచ్చితంగా స్పందిస్తామని సవాల్ చేసింది. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో ఇరాన్-అమెరికా మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు పెరిగాయి. హమాస్ నేత హనియా హత్య వెనుక టెల్అవీవ్ హస్తం ఉందని టెహ్రాన్ భావిస్తోంది. ఈ సమయంలో హ్యాకింగ్ ఆరోపణలు వెలువడటం గమనార్హం. మరోవైపు అమెరికా కూడా ఏ ఆధారాలతో ఈ ఆరోపణలు చేస్తోందో వెల్లడించలేదు.

చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

తయారీ ఖర్చు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏవీఎం3 రాకెట్ తరహాలో కొత్త రాకెట్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇది పేలోడ్‌ను మూడు రెట్లు అధికంగా మోసుకెళ్తుందని ఆయన తెలిపారు. ఆగస్టు 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినంగా పాటించనున్నట్లు చెప్పారు. 23ను నేషనల్ స్పేస్ డేగా కేంద్ర సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.

పల్లెల్లో మళ్లీ వెలుగులు

(మొదటిపేజీ తరువాయి)

పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు చేపట్టాలని సీఎం తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖలో కొద్ది రోజులుగా తీసుకున్న నిర్ణయాలను, సంస్కరణలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. గ్రామాల ముఖచిత్రం మార్చడంలో కీలకమైన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, నేడు మళ్లీ నిధులు, కొత్త విధానాల ద్వారా గ్రామాల్లో సమూల మార్పులు తీసుకువస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.

వైద్య సిబ్బంది పరిరక్షణకు చట్టం

(మొదటిపేజీ తరువాయి)

చట్టం అవసరమని తెలిపింది. వైద్యుల డిమాండ్ల పరిష్కారానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరింది. ఇలాంటి అనాగరిక, పాశవిక ఘటనలకు సమాజంలో చోటు లేదని కోల్‌కతా ఉదంతాన్ని ఉద్దేశించి సీపీఐ పేర్కొంది. మహిళలకు పనిప్రదేశాల్లో గౌరవం, రక్షణ ఉండాలని, వేళకాని వేళల్లో విధులు నిర్వర్తించే మహిళా వైద్యుల భద్రతకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని సూచించింది. కోల్‌కతా ఘటనలో సాధ్యమైనంత త్వరగా న్యాయం జరగాలని, దోషులకు కఠిన శిక్షలు పడాలని డిమాండ్ చేసింది. ఈ కేసు ఒక్కటే కాదు మహిళలపై హింసను అరికట్టేందుకు దర్యాప్తు సంస్థలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరమని పేర్కొంది. చట్టబద్ధంగా పటిష్ఠ చర్యలు, సత్వర న్యాయం, మహిళలకు భద్రత, వారి హక్కులపై అవగాహన, హేయమైన నేరాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది.

నేడు భారత్ బంద్

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి ఇచ్చిన పిలుపుకు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని సంఘాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఆ రాష్ట్రాల్లో హై అలర్ట్ ఉంది. విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, విపణులను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతివ్వాలని ఆయా సంఘాలు పిలుపునిచ్చాయి. అయితే విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు పనిచేస్తాయని, అత్యవసర సేవలు, ప్రజా రవాణా, విద్యుత్ సేవలకు పెద్దగా అంతరాయం ఉండబోదని తెలుస్తోంది.

కాంగ్రెస్ 20 ప్రెస్‌మీట్లు

(మొదటిపేజీ తరువాయి)

విచారణ అవసరమని నొక్కిచెబుతోంది. ఇదే విషయాన్ని దేశప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో 20 విలేకరుల సమావేశాలు చేపడుతున్నట్లు పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో స్పందిస్తూ 'నేడు దేశవ్యాప్తంగా 20 విలేకరుల సమావేశాలను నిర్వహించి మోదానీ మహా కుంభకోణంపై జేపీసీ విచారణ అవశ్యకతను, ఈ వ్యవహారాలు ఆర్థిక వ్యవస్థను ఎంతలా ప్రభావితం చేస్తాయో చెబుతాం' అని పేర్కొన్నారు. హమ్ అదానీ కే హై కౌన్ సిరీస్‌లో భాగంగా మోదానీ కుంభకోణంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేయడాన్ని గుర్తుచేశారు. కాగా, సెబీ చైర్‌పర్సన్ మాధవి బచ్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పిలుపునిచ్చిన విషయం విదితమే.

స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే స్థానిక సంస్థలకు మరిన్ని నిధుల విడుదలకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు రూ.998 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.454 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామ, వార్డు స్థాయిల్లో పనులు వేగవంతం చేయాలని చంద్రబాబు సూచించారని, వీటితో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగే అవకాశం ఉంటుందన్నారు.

బీజేపీ కుట్ర భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

తొలగించడం ద్వారా కుల గణన ఆధారంగా మేం సామాజిక న్యాయాన్ని అందిస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు. ఈ పరిణామంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ... "రాజ్యాంగ పరిరక్షణకు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం... రిజర్వేషన్లను లాక్కోవాలనే బీజేపీ ప్రణాళికలను విఫలం చేసింది" అని అన్నారు. "లేటరల్ ఎంట్రీపై మోదీ ప్రభుత్వ లేఖ... రాజ్యాంగ శక్తి మాత్రమే నియంతృత్వ పాలన దురహంకారాన్ని ఓడించగలదని తేటతెల్లం చేస్తోంది" అని ఖర్గే 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రత్యేకించి రాహుల్ గాంధీ, కాంగ్రెస్, ఇండియా ఐక్యసంఘటనపార్టీలు చేస్తున్న ఎదురు దాడి వల్లే ప్రభుత్వం ఒక అడుగు వెనక్కి వేసిందన్నారు. అయితే బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు అధికారంలో ఉన్నంత కాలం రిజర్వేషన్లను లాక్కోవడానికి కొత్త వ్యూహాలను అవలంబిస్తూనే ఉంటాయని, మనందరం జాగ్రత్తగా ఉండాలని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్... కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ లేఖను 'ఎక్స్'లో ట్యాగ్ చేస్తూ... 'జీవం లేని ప్రధానమంత్రి కింద పనిచేస్తున్న కేంద్ర మంత్రి తేదీ లేకుండా రాజ్యాంగబద్ధ సంస్థకు రాసిన లేఖ. ఇది ఎంత దయనీయమైన పాలన' అని వ్యాఖ్యానించారు. అయితే లోక్‌సభ, రాజ్యసభల్లో కాంగ్రెస్ సహా ప్రతిపక్షపార్టీల లేటరల్ నియామకాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కారణంగానే నియామక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కేంద్రం కోరినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా ప్రతిపక్షాలు, ఎన్డీయే మిత్రపక్షాల ఒత్తిడి మేరకు లేటరల్ ఎంట్రీ విధానం ఉపసంహరించుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలను తమ పార్టీ స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా తెలిపారు. "దేశం యొక్క మన్ కీ బాత్ వినవలసిన సమయం ఆసన్నమైందని మేము కూడా ప్రధానమంత్రికి సలహా ఇవ్వాలనుకుంటున్నాము. దేశం తన 'మన్ కీ బాత్'ని ప్రతిపక్షాల ద్వారా, మీ మిత్రపక్షాల ద్వారా తెలియజేస్తుంది...మా మాట వినండి. అది మీకు అలవాటు కావాలి. మీరు సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్నారు. మిత్రపక్షాలను విశ్వాసంలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలి" అని ఖేరా ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. ఈ పరిణామంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విప్ మాణిక్యం ఠాగూర్ స్పందిస్తూ, "2024 మనకు రెండు ఫలితాలను ఇచ్చింది: బలహీనమైన ప్రధానమంత్రి, బలమైన ప్రజానాయకుడు, ప్రతిపక్ష నాయకుడు. చివరికి ఇది మన రాజ్యాంగ విజయం." అన్నారు.

రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం: ఆప్

ఐఏఎస్ అధికారుల నియామకంలో రిజర్వేషన్‌ను రద్దు చేయాలని బీజేపీ భావిస్తోందని ఆప్ నేత జాస్మిన్‌షా విమర్శించారు.

బీజేపీ రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకమైన పార్టీ అని దేశం మొత్తానికి తెలుసునన్నారు. ఐఏఎస్ అధికారుల నియామకాల్లో రిజర్వేషన్‌ను రద్దు చేయాలని వారు కోరుతున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో వారు 400 అనే నినాదాన్ని ఇచ్చారు. అయితే ప్రజలు వారి ఉద్దేశాలను అర్థం చేసుకుని 240 సీట్లకు పరిమితం చేశారని ఆయన పేర్కొన్నారు. లేటరల్ ఎంట్రీ విధానం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు.

గత్యంతరం లేకనే...

వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ) అధినేత ప్రకాష్ అంబేద్కర్ మాట్లాడుతూ గతంలో బీజేపీకి కేంద్రంలో పూర్తి మెజారిటీలో ఉన్నప్పుడు ఏకపక్షంగా పని చేసేదని... ఇప్పుడు దానికి ఎటువంటి అవకాశం లేకుండా పోయిందన్నారు. గత్యంతరం లేకనే లేటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్‌ను రద్దు చేయాల్సి వచ్చిందని అన్నారు. గిరిజన సంఘాల ప్రతినిధులు, నాయకుల సమావేశం అనంతరం ఆయన నాగపూర్‌లో మీడియాతో మాట్లాడారు. గిరిజన సంఘం హక్కుల పరిరక్షణకు వీబీఏ, గిరిజన సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. లేటరల్ ఎంట్రీ విధానంపై కేంద్ర వెనక్కు తగ్గిన అంశాన్ని ప్రస్తావించగా... ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నేరుగా చేపట్టే అధికారం మంత్రులకు, రాష్ట్రపతికి లేదా ప్రధానమంత్రికి కూడా లేదు. దీనిని సవాలు చేసినప్పుడు, ప్రభుత్వానికి వెనక్కి తగ్గడం, ఉపసంహరించుకోవడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అన్నారు.

అధికారుల కలవరం

(మొదటిపేజీ తరువాయి)

పొడిగించాలని కేంద్ర రైల్వే శాఖకు ప్రభుత్వం లేఖ రాసింది. దీని ఆధారంగా మధుసూధన్ రెడ్డి వ్యవహారం, ఆయనకు సహకరించిన గత ప్రభుత్వ పెద్దలపైనా తీగలాగే అవకాశం ఉంది. మధుసూదన్ రెడ్డి తన పదవీ కాలంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అందుకు సీఐడీ లాంటి సంస్థతో విచారణకు సిద్ధమైనా ఆశ్చర్యం లేదు. ఇదే తరహాగా ఏపీ బేవరజీస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి పైనా భారీ అభియోగాలున్నాయి. ఇటీవల ఆయన అరెస్టు చేశారని, ఇప్పటికే సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. దీనిపై సీఐడీ అధికారులు స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో మద్యం బ్రాండ్లు, విక్రయాల నిర్వహణ మొత్తం ఆయన అధీనంలోనే కొనసాగినట్లుగా ప్రచారం ఉంది. నాసిరకం మద్యం విక్రయంతో అనేక అక్రమాలు నెలకొన్న సంఘటనలు వెలుగు చూశాయి. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టకముందే ఏపీ బేవరజీస్ కార్పొరేషన్ కార్యాలయం దగ్గర పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి, ఫైళ్లు మాయమవ్వకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. హైదరాబాద్‌లోని వాసుదేవ రెడ్డి ఇంటికి సీఐడీ అధికారులు వెళ్లి సోదాలు నిర్వహించి, అనేక కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఐపీఎస్‌ల్లో గుబులు

గత వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలపై కొందరు ఐఏఎస్ అధికారులను కూటమి ప్రభుత్వం పక్కనపెట్టింది. వారంతా ప్రతిరోజూ డీజీపీ ప్రధాన కార్యాలయానికి వచ్చి రిపోర్ట్ చేయాలంటూ ఇటీవల డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉండి... అందుబాటులోలేని 16 మంది ఐపీఎస్‌లకు మెమోలు జారీ చేశారు. సీనియర్ ఐపీఎస్‌లు టీఎస్ఆర్ ఆంజనేయులు, సంజయ్, పీవీ సునీల్‌కుమార్, కాంతిరాణా టాటా, కొలి రఘురామ్ రెడ్డి, అమ్మిరెడ్డి విజయరావు, విశాల్ గున్నీ, రవిశంకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర రెడ్డి, కృష్ణకాంత్ పటేల్, బాలరాజు తదితరులకు మెమోలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డీజీపీ కార్యాలయంలోనే ఉండాలన్న నిబంధన విధించారు. విధులు ముగిశాక అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాలని ఆదేశించారు. వారంతా డీజీపీ కార్యాలయానికి ప్రతిరోజూ రావాల్సిన పరిస్థితి వచ్చింది. దీనిని అవమానంగా భావించిన కొందరు మూకుమ్మడి సెలవులకు దరఖాస్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ, ఎక్కడా తగ్గకుండా వారికి బాధ్యతలను అప్పగించలేదు. 16 మంది ఐపీఎస్‌లలో కొందరు పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారున్నారు. మరికొందరికి చాలా సర్వీసు ఉంది. చంద్రబాబు, లోకేశ్‌పై సీఐడీ కేసుల నమోదులో సంజయ్ అత్యుత్సాహం చూపారన్న విమర్శలున్నాయి. అప్పటి ఎంపీ రఘురామ కృష్ణరాజును అరెస్టు చేసి, కస్టోడియల్ విచారణలో గత సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ వేధింపులకు గురిచేశారన్న ప్రచారం ఉంది. ఈ జాబితాలోని ఐపీఎస్‌లు అంతా గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించినట్లుగా అధికార టీడీపీ ఆరోపిస్తోంది. భవిష్యత్‌లో వారిపై ఎలాంటి చర్యలుంటాయనేదీ వేచి చూడాలి. గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారన్న ఐఏఎస్‌లు శ్రీలక్ష్మి, ప్రవీణ్ ప్రకాశ్, రజత్ భార్గవ్, మురళీధర్ రెడ్డి లాంటి సీనియర్ ఐఏఎస్‌లకు ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వకుండా జీఏడీకి అటాచ్ చేశారు. వారిలో ప్రవీణ్ ప్రకాశ్ కలత చెంది ఇప్పటికే ఐఏఎస్ సర్వీసుకు రాజీనామా చేశారు.

ప్రవీణ్ ప్రకాశ్ వీఆర్ఎస్ రద్దు ఆలోచన?

సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ మళ్లీ సర్వీసులోకి వచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కు దరఖాస్తు చేసుకోగా, దానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇంకా ఆయన సర్వీసు ఏడు సంవత్సరాలు ఉంది. జూన్ 25న ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఆమోదిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ఆయన వీఆర్ఎస్ సెప్టెంబరు 30 నుంచి అమలులోకి వస్తుంది. గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా ప్రవీణ్ ప్రకాశ్ బాధ్యతలు నిర్వహించారు. నిత్యం పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేశారన్న విమర్శలున్నాయి. ఆయన తనిఖీల్లో చాలా మంది ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులపై వేటు వేశారు. దీంతో ప్రవీణ్ ప్రకాశ్‌పై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దాని ప్రభావం ఎన్నికల్లో జగన్ ప్రభుత్వంపై పడిందన్న వాదనలున్నాయి. ఐఏఎస్‌కు తాను చేసిన రాజీనామాను వెనక్కి తీసుకునే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. వీఆర్ఎస్‌ను 90 రోజుల్లోగా ఉపసంహరించుకునే అవకాశం ఉంది. దీంతో త్వరలో సీఎం చంద్రబాబును కలిసి తన వీఆర్ఎస్‌కు గల వాస్తవ పరిస్థితులను వివరిస్తారని తెలిసింది. అన్నీ కలిసొచ్చి సీఎం ఆమోదిస్తే... మళ్లీ ప్రవీణ్ ప్రకాశ్ పూర్తి స్థాయి సర్వీసులోకి వస్తారని ప్రచారం ఉంది. కూటమి ప్రభుత్వం దూకుడుతో ఎప్పుడు, ఎవరిపై వేటు పడుతుందనే దిశగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు కలవరం చెందుతున్నారు.

తలొంచిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ అనేది సామాజిక న్యాయ చట్రం' కు మూలస్తంభమని భావిస్తున్నారని ఆ లేఖలో సింగ్ పేర్కొన్నారు. 'ఈ స్థానాలను ప్రత్యేకమైనవిగా పరిగణించి, సింగిల్ కేడర్ పోస్టులుగా నియమించినందున, ఈ నియామకాల్లో రిజర్వేషన్‌కు ఎలాంటి నిబంధన లేదు. ప్రధాన మంత్రి సామాజిక భద్రతపై దృష్టి సారించిన నేపథ్యంలో ఈ అంశాన్ని సమీక్షించి, సంస్కరించాల్సిన అవసరం ఉంది' అని తెలిపారు. 17.8.2024న జారీ చేసిన లేటరల్ ఎంట్రీ నియామక ప్రకటనను రద్దు చేయాలని నేను యూపీఎస్సీని కోరుతున్నాను' అని అన్నారు. సామాజిక న్యాయం, సాధికారత సాధనలో ఈ చర్య గణనీయమైన ముందడుగు అని సింగ్ పేర్కొన్నారు. 'వీరప్ప మొయిలీ అధ్యక్షతన 2005లో ఏర్పాటయిన రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ సూత్రప్రాయంగా లేటరల్ ఎంట్రీ నియామకాలను ఆమోదించిన విషయం తెలిసిందే. 2013లో ఆరవ వేతన సంఘం సిఫార్సులు కూడా అదే దిశలో ఉన్నాయి' అని అన్నారు. ఈ ప్రవేశ ప్రక్రియ తప్పనిసరిగా రాజ్యాంగంలో పొందుపరచబడిన సమానత్వం, సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ఉండాలని, ముఖ్యంగా రిజర్వేషన్ల నిబంధనలకు సంబంధించి ఉండాలని ప్రధాని దృఢంగా విశ్వసిస్తున్నారని సింగ్ చెప్పారు.

లేటరల్ ఎంట్రీ అంటే?

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మధ్య స్థాయి, సీనియర్ స్థాయి పదవులను సాధారణంగా ఐఏఎస్ వంటి సివిల్ సర్వీసుల అధికారులతో భర్తీ చేస్తారు. ఈ పదవులను సివిల్ సర్వీసులతో సంబంధం లేని బయటి వ్యక్తులు, నిపుణులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడాన్నే 'లేటరల్ ఎంట్రీ' అని అంటారు. మూడేళ్లు లేదా ఐదేళ్ల ఒప్పందంతో వీరిని నియమిస్తారు. ఈ పద్ధతిని 2018లో మొదటిసారి అమలు చేశారు.

విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో...

ఈ విధానాన్ని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. దానిని జాతి వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆరోపించారు. సమాజ్‌వాదీ, బీఎస్పీ సైతం ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. బీజేపీ తమ అనుయాయులను పెద్ద పదవుల్లో కూర్చోబెట్టేందుకు చేస్తున్న కుట్రగా పేర్కొన్నాయి. అయితే ఈ విధానాన్ని తీసుకొచ్చింది గత యూపీఏ ప్రభుత్వమేనని బీజేపీ కేంద్ర మంత్రులు తెలిపారు. విపక్షాల ఆరోపణలను కొట్టిపారేశారు.

భయంకరం

(మొదటిపేజీ తరువాయి)

డీవై చంద్రచూడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రముఖ డాక్టర్లు, నిపుణులతో కూడిన 10మంది సభ్యులతో ఓ జాతీయ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు వెలువరించారు. సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్.కె.శరిన్ అధ్యక్షతన జాతీయ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు కానుంది. అన్ని ఆస్పత్రుల్లో సురక్షిత పరిస్థితులను కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. టాస్క్ ఫోర్స్‌లో తెలుగు వారికి చోటు కల్పించింది. ఏఐజీ హాస్పిటల్స్ ఛీఫ్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, ఎయిమ్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను సభ్యులుగా నియమించింది. "మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్లే. ఈ రోజుల్లో చాలామంది యువ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరం. మాపై విశ్వాసం ఉంచండి. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందుకు మరో అత్యాచారమో లేదా హత్యనో జరిగేవరకు మనం ఎదురుచూడొద్దు" అని ధర్మాసనం వెల్లడించింది. వైద్యుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై మూడు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఈ కమిటీకి సూచించింది.

ప్రిన్సిపల్ ఏం చేస్తున్నారు ?

విచారణ సందర్భంగా బెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులు, మెడికల్ కాలేజీ అధికారుల తీరుపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. "ఈ ఘటనలో నేరాన్ని ఉదయాన్నే గుర్తించినట్లు తెలిసింది. కానీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మాత్రం దీన్ని ఆత్మహత్య కేసుగా సమాచారం అందించే ప్రయత్నం చేశారు. అతడి ప్రవర్తనపై అనుమానాలు ఉన్నప్పుడు.. వెంటనే మరో కాలేజీకి ఎలా నియమించారు? ఇక, ఎఫ్ఐఆర్ నమోదు కూడా ఆలస్యమైంది. మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 4 గంటల మధ్య శవ పరీక్ష పూర్తయ్యింది. కానీ, మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన 3 గంటల తర్వాత రాత్రి 11.45 గంటలకు ఎందుకు నమోదు చేయాల్సివచ్చింది? ఆసుపత్రి అధికారులు, కోల్‌కతా పోలీసులు అప్పటివరకు ఏం చేస్తున్నారు?. మృతదేహాన్ని చూపించేందుకు తల్లిదండ్రులు గంటల పాటు వేచిచూసేలా ఎందుకు చేశారు? " అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసు దర్యాప్తు స్టేటస్ రిపోర్టును ఆగస్టు 22 కల్లా సమర్పించాలని కోర్టు సీబీఐని ఆదేశించింది. విచారణ సందర్భంగా ఘటనను నిరసిస్తూ జరిగిన ఆందోళనలపై బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఇది దేశమంతా ఆందోళన వ్యక్తం చేస్తున్న అంశం. డాక్టర్లు, పౌరసమాజాన్ని అడ్డుకోవడం సరికాదు. క్రైమ్ సీన్‌ను రక్షించాల్సిన, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే" అని ధర్మాసనం మందలించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 22వ తేదీకి వాయిదా వేసింది.

వైద్య సిబ్బంది భద్రతపై చర్యలకు ప్రతిపాదన...

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వైద్య సిబ్బంది భద్రత విషయమై ఆసుపత్రులు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది. ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు అందించే గదుల వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు అవసరం కావొచ్చు. ఆసుపత్రుల్లోకి ప్రమాదకర వస్తువులు రాకుండా బ్యాగేజీ స్క్రీనింగ్ చేయాలి. పేషంట్లు కాకుండా..లోపలికి వచ్చే విజిటర్స్ సంఖ్యపై పరిమితి ఉండాలి. రద్దీని నిర్వహించడానికి సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. వైద్యులు, నర్సులకు రెస్ట్ రూమ్‌ల వసతి కల్పించాలి. అక్కడ బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ ఏర్పాట్లు ఉండాలి. ఆసుపత్రి ప్రాంగణంలోని అన్ని ప్రాంతాల్లో సరిపడా వెలుతురు ఉండాలి. అలాగే సీసీ కెమెరాలను అమర్చాలి. రాత్రి పది నుంచి తెల్లవారుజామున ఆరు గంటల మధ్యలో రవాణా సదుపాయం కల్పించాలి. బాధ, సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వర్క్‌షాపులను నిర్వహించాలి. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ప్రతి మూడు నెలలకొకసారి ఆడిట్ చేపట్టాలి. మహిళా ఉద్యోగులందరికీ సురక్షితమైన పనివాతావరణాన్ని కల్పించడం వైద్య సంస్థలకు వర్తిస్తుంది కాబట్టి..అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. వైద్య నిపుణులకు అత్యవసర పరిస్థితుల కోసం హెల్ప్‌లైన్ నంబర్స్ అందుబాటులో ఉంచాలి.

భగ్గుమన్న తాడిపత్రి

(మొదటిపేజీ తరువాయి)

ఉద్రిక్తంగా మారడంతో పెద్దారెడ్డిని తాడిపత్రి నుంచి అనంతపురం పంపించారు. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని పెద్దారెడ్డిని అనంతపురం పంపించామని జిల్లా ఎస్పీ జగదీశ్ మీడియాకు తెలిపారు. ఒకరినొకరు రెచ్చగొట్టుకునే ధోరణి సరికాదన్నారు. కాగా వైసీపీ నేత మురళీ తుపాకీ చూపడం వల్లే టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారని టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారని పోలీసులకు సమాచారం ఉన్నా నిలువరించలేకపోయారన్నారు. పెద్దారెడ్డి తాడిపత్రిలో ప్రవేశించాక వైసీపీ కార్యకర్తలు టీడీపీ వాళ్లను రెచ్చగొట్టారని ఆరోపించారు. మా ఇంటి వద్ద మురళీ తుపాకీ బయటకు తీసి చూపడంతో టీడీపీ కార్యకర్తలు గట్టిగా సమాధానం చెప్పారన్నారు. తాను తాడిపత్రిలో ప్రశాంతత కోరుకుంటున్నానని, అందుకు పోలీసులు సహకరించాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా ఘర్షణకు దిగిన ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పెద్దారెడ్డి రాకను జీర్ణించుకోలేకే దాడి: వైసీపీ

తాడిపత్రికి మళ్లీ పెద్దారెడ్డి రావడాన్ని జీర్ణించుకోలేక జేసీ వర్గీయులు తమ నాయకులు, కార్యకర్తలపై దాడి చేశారని వైసీపీ ఆరోపించింది. మూడు నెలల తర్వాత డాక్యుమెంట్స్ తెచ్చుకోవడానికి ఎస్పీ అనుమతితో పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లారని తెలిపింది. ఈ విషయం తెలుసుకుని తమ నేత కందిగోపుల మురళీ ఇంటిపై జేసీ వర్గీయులు దాడి చేశారని తెలిపింది. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు పెద్దారెడ్డిని తాడిపత్రి నుంచి పంపించారని పేర్కొంది.

ఏపీ విద్యార్థులకు ప్రవేశాలు కొనసాగించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించే విద్యాకోర్సుల్లో ఏపీ విద్యార్థులకు సైతం ప్రవేశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరహరి, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ప్రవేశమంటూ ఏకపక్షంగా నోటిఫికేషన్ విడుదల చేయడం విచారకరమని, వెంటనే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని... ఈ విద్యాసంవత్సరం ఉభయ రాష్ట్రాల్లోని విద్యార్థులకు ప్రవేశాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏపీలో నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాలకుల నిర్లక్ష్యం... పోలీసుల వైఫల్యం

మహిళలపై అఘాయిత్యాలకు ముగింపు లేదా?

ఆచూకీ లభించని ముచ్చుమర్రి చిన్నారి మృతదేహం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దీనికి కారణం చట్టాల్లో ఉన్న లోపమా... ప్రభుత్వ నిర్లక్ష్యమా... పోలీసుల వైఫల్యమా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దిల్లీలో నిర్భయపై జరిగిన అత్యాచారం దేశాన్ని కలచివేసింది. నాటి నుండి నేటి వరకు ఎక్కడబడితే అక్కడ ఇటువంటి దుర్మార్గాలు జరుగుతునే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేయడంలో ఎవరిది నిర్లక్ష్యం అన్న ప్రశ్న చర్చనీయాంశమైంది. చట్టాలలోని లొసుగులు, రాజకీయ జోక్యం, పోలీసుల వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం ఇందుకు కారణంగా చెప్పవచ్చు. తెలంగాణలో దిశపై అత్యాచారం చేసిన వెంటనే నిందితులను అప్పటి ప్రభుత్వం ఎన్‌కౌంటర్ చేసింది. అయినా అఘాయిత్యాలు ఆగలేదు. రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో చిన్నారి వాసంతి (8) అదృశ్యమై 40 రోజులు దాటినా...ఇప్పటికీ జాడ తెలియలేదు. మొదట రాజకీయ నాయకులు, అధికారులు హడావుడి చేశారు. కానీ నేటికి మృతదేహం లభ్యం కాలేదు. ఆ తల్లిదండ్రుల కడుపుకోత తీరలేదు. తనబిడ్డ ప్రాణాలతో లేకపోయినా కనీసం మృతదేహమైనా లభిస్తుందన్న ఆ తల్లిదండ్రుల కోరిక తీరనే లేదు. పోలీసులు నిందితులను అరెస్టుచేశారు. ఈ కేసులో ఓ నిందితుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ప్రభుత్వం, బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకుంది. 2022లో కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడులో అజీరా బేగంను కొంతమంది అత్యాచారం చేసి హత్యచేశారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని పుకార్లు వచ్చాయి. కానీ ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. నాడు అధికారంలో ఉన్న పార్టీ అండదండలతో వారు తప్పించుకున్నట్లు ప్రచారం జరిగింది. అజీరా బేగం మృతి విషయం తెలుసుకున్న ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సహా సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామం వెళ్లి అజీరా కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులను అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు. కానీ నేటి వరకు ఆ కుటుంబానికి న్యాయం జరగలేదు. ఇలా అనేకమంది బాధితులు ఉన్నారు. కోల్‌కతా డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులలో ఒకడిని మాత్రమే మమత ప్రభుత్వం అరెస్టు చేసింది. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామం మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పార్వతి (15) ఈనెల 4వ తేదీన హాస్టల్‌లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. ఇది ఆత్మహత్యకాదు... హత్య అంటూ తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేశారు. అయినా ఇంతవరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నిందితులు చట్టాల్లో ఉన్న లోసుగులను అసరగా తీసుకుని సభ్యసమాజం తలదించుకునేలా ఇటువంటి దారుణాలకు వడిగడుతున్నారు. స్వతంత్ర భారతదేశంలో నేటికీ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరం. నిందితులు తప్పించుకునేందుకుచాల్సిన అవసరం ఉంది. నిందితులు ఎంతటి వారైనా... ఏ పార్టీకి చెందిన వారైనా... ఏ కులం వారైనా కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

చత్తీస్‌గఢ్ జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

మంత్రి అనితకు ఏపీయూడబ్ల్యూజే వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు జర్నలిస్టులపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసుపై రీ ఎంక్వైరీకి ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) నేతలు హోం మంత్రి అనితను కలిశారు. ఆ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు కేసు పూర్వపరాలను వివరించారు. ఈ కేసుపై చత్తీసగఢ్ పోలీసు అధికారులు స్పందించి కొండ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. జర్నలిస్టులపై అక్రమ కేసు నమోదులో చింతూరు సీఐ పాత్ర ఉందని వెంటనే విచారణ జరిపించి కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వెంటనే స్పందించిన హోం మంత్రి అనిత... అల్లూరి సీతారామ జిల్లా ఎస్పీతో మాట్లాడి ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ ఘటనపై రీ ఎంక్వయిరీ చేసి తనకు నివేదిక ఇవ్వాలని ఎస్పీకి మంత్రి ఆదేశాల ఇచ్చారని యూనియన్ నేతలు తెలిపారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని యూనియన్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, యూనియన్ రాష్ట్ర నాయకులు కృష్ణ మోహన్, సచివాలయ జర్నలిస్టులు సత్యనారాయణ, రామకృష్ణ, ప్రసన్నకుమార్, విజయ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆ టీచర్ల కుటుంబాలకు రూ.15 లక్షలు... ఉద్యోగం

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఇటీవల వాగు దాటుతూ మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థిక సహాయం, ఉద్యోగాన్ని ప్రకటించినట్లు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు మహేష్ (29), ఆర్తి (26) వాగు దాటుతూ దురదృష్టవశాత్తూ మృతి చెందారని అన్నారు. సోమవారం రాత్రి ఆర్తి మృతదేహం, ఉదయం మహేష్ మృతదేహం దొరికాయని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు వారి మృతదేహాలను విమానంలో తీసుకువెళ్లి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మంత్రి వివరించారు. కేంద్ర సాయంగా రూ.10 లక్షలు, రాష్ట్ర సాయంగా రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షల చొప్పున ఒక్కొక్క కుటుంబానికి అందజేస్తామని చెప్పారు. బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలోని ప్రైవేటు వసతి గృహంలో ముగ్గురు చిన్నారులు కలుషిత ఆహారం తిని మృతి చెందిన ఘటనపైనా సీఎం చంద్రబాబు తీవ్ర సంతాపం తెలియజేస్తూ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని వివరించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపులేని పాఠశాలలు, వసతి గృహాలు ఉంటే, వెంటనే వాటిని గుర్తించి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు.

ఎస్క్రో ఖాతాలకే జీతాలు

తిరుపతిలో విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా

విశాలాంధ్ర - తిరుపతి: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పట్టించుకోని విద్యుత్ సంస్థ వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల ఉద్యోగులు స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, మీటర్ రీడర్ల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం బాలకాశి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్, మీటర్ రీడర్ల రాష్ట్ర కార్యదర్శి హజరత్ వలి, కోశాధికారి కె.రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.కిరణ్ కుమార్, మీటర్ రీడర్స్ చిత్తూరు జిల్లా కార్యదర్శి వర్మ పాల్గొన్నారు. ఓబులేసు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్ల ఉద్యోగానికి ఎసరుపెట్టే ప్రమాదం ఉందని, అందువల్ల విద్యుత్ సంస్థను నమ్ముకొని 20 ఏళ్లుగా పనిచేస్తున్న అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత విద్యుత్ సంస్థ, ప్రభుత్వంపై ఉందన్నారు. బాలకాశి మాట్లాడుతూ విద్యుత్ సంస్థను నమ్ముకొని వెట్టి చాకిరి చేస్తున్నా... శ్రమకు తగిన వేతనం మీటర్ రీడర్లకు రావడం లేదని, కాంట్రాక్టర్లు నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నో పోరాటాలు చేయగా ఆంధ్ర ప్రదేశ్ ఇంధన శాఖ కార్యదర్శి మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఎస్పీడీసీఎల్ సీఎండీకి ఉత్తర్వులు జారీ చేసినా ఫలితం లేదన్నారు. జులై 31న బిల్లింగ్ టెండర్లకు ఉత్తర్వులు జారీ చేశారని, కానీ ఆ ఉత్తర్వుల్లో ఇంధన శాఖ కార్యదర్శి మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలన్న ఆదేశాలు పొందు పర్చలేదన్నారు. హజరత్ వలి మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు తొత్తులుగా ఎస్పీడీసీఎల్ యాజమాన్యం వ్యవహ రించటం దుర్మార్గమన్నారు. గతంలో రూ.3.80 ఉన్న పీస్ రేటును రూ.3.60కి తగ్గించి ఐదేళ్లలో మీటర్ రీడర్ల జీతాల నుంచి కాంట్రాక్టర్లు కోట్లలో దోచుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

కౌలు రైతుల రక్షణ, సంక్షేమానికి ప్రత్యేక నిధి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: కౌలు రైతుల సంక్షేమం, రక్షణ కోసం సమగ్ర కౌలు చట్టం తీసుకురావాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సంఘం రాష్ట్ర నాయకులు కంజుల విఠల్‌రెడ్డి, పీవీ జగన్నాథం, పెయ్యల వెంకటేశ్వరరావుతో కూడిన ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఐహెచ్‌సీ భవన్‌లో గల వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ వల్లూరి శ్రీధర్‌కు ప్రతినిధి బృందం మంగళవారం వినతిపత్రం అందజేసింది. వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కౌలు రైతుల సంక్షేమం-రక్షణ కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరింది. అనంతరం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జమలయ్య మాట్లాడారు. వ్యవసాయ రంగంలో చోటుచేసుకున్న మార్పులను పరిగణనలోకి తీసుకుంటే కౌలు వ్యవసాయమే కీలకంగా మారిందని, అన్ని పంటల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ కౌలుసేద్యం రోజురోజుకు పెరుగుతోందని జమలయ్య అన్నారు. సాగుదారుల్లో 70 శాతం కౌలు రైతులు 80 శాతం పంటలు పండిస్తున్నారని తెలిపారు. కౌలు రైతులను గుర్తించడంలో లోపం జరుగుతోందని, ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టంలో భూ యజమాని గుర్తింపు కార్డుపై సంతకం పెడితేనే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిబంధనలు ఉన్నాయని, ఈ చట్టాన్ని రద్దు చేసి సులభంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పంట రుణాలు అందించటంలో వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు విఫలమవుతున్నాయన్నారు. ఆర్‌బీఐ నిబంధనలను ఏ బ్యాంకు అమలు చేయడం లేదని, దీంతో వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్నారన్నారు. పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే వెసులుబాటు లేక మధ్య దళారులకు, వ్యాపారులకు అతి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ప్రకృతి విపత్తులు, చీడపీడలు సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం కౌలు రైతులకు చెల్లించడం లేదన్నారు. కౌలురైతుల ఇబ్బందులను జాయింట్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. కౌలు రైతులకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారని, దీనికి బదులు కొత్తచట్టం తెస్తామన్నారని గుర్తుచేశారు. ఈ చట్టంలో తాము సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గుర్తింపు కార్డులు పొందిన ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోం

'బీసీ' హాస్టళ్ల నిర్వహణపై మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ: రాష్ట్రంలోని బీసీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. అధికారులు, వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో ఉన్న తన కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో ఆమె మంగళవారం సమావేశమయ్యారు. హాస్టళ్ల విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడు కోవాలని, బయట ఆహారం హాస్టల్లోకి రానివ్వొద్దని, విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూసుకోవాలని సూచనలు చేశారు. పారిశుద్ధ్యం, రక్షిత తాగునీరుపై దృష్టిపెట్టాలన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం, అల్పాహారం అందించాలన్నారు. వార్డెన్లు రాత్రిళ్లు హాస్టళ్లలోనే బస చేయాలని మంత్రి తెలిపారు. జిల్లా అధికారులు హాస్టళ్లను సందర్శిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, కిందిస్థాయి సిబ్బందిని పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, బీసీ గురుకుల కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు. ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే సత్యసాయి జిల్లాతో పాటు పెనుకొండ నియోజకవర్గంలోని సమస్యలపై, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో విద్యుత్, సాంఘిక పరమైన సమస్యలను చర్చించారు. సముచిత విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బంది పడుతుండటంతో అనువైన చోట సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మండల కేంద్రాలలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు గురించీ మంత్రి చర్చించారు.

ఆంధ్రరత్న భవన్‌లో రాజీవ్ జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ నేతలు నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేశారు. పీసీసీ మాజీ కార్య నిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ కంప్యూటర్, సమాచార విప్లవానికి రాజీవ్‌గాంధీ నాంది పలికి, దేశాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. భారత ప్రధాన మంత్రులలో అతి పిన్న వయసులో ప్రధాన మంత్రి అయిన రాజీవ్‌గాంధీ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. విదేశీ విధానంలో చురుకైన పాత్ర పోషించి పొరుగు దేశాలతో మెరుగైన సంబంధాల కోసం కృషి చేశారని వివరించారు.

ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.గురునాథం, కొలనుకొండ శివాజీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, పార్టీ నాయకులు పీవై కిరణ్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు

- వేదవతి ఉధృత ప్రవాహం... నిండుకుండలా హంద్రీ వాగు
- కర్నూలు జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కర్నూలు జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వేదవతి నది ఉప్పొంగడంతో కర్నాటక-ఆంధ్ర ప్రదేశ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోసిగి మండలం దేవరబెట్ట గ్రామానికి వెళ్లే రోడ్డు కల్వర్టు తెగిపోయింది. హాలహర్వి మండలం అమృతాపురంలో టోపీ మారెమ్మవ్వ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారిలో చిన్నహుల్తి సమీపంలోని హంద్రీ వాగు నిండుకుండలా ప్రవహిస్తోంది. వరద నీరు ప్రధాన రహదారిపైకి రావటంతో పత్తికొండ- ఆదోని మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల సమీపంలో ప్రధాన రహదారిపై ఇసుకలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతకుంట వద్ద తాత్కాలిక వంతెన కోతకు గురైంది. భారీ వర్షాలకు ఈదురు గాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గత నెలరోజుల నుంచి వర్షం లేక వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షంతో కొంత ఉపశమనం లభించినట్లు అయింది. వర్షం లేక ఎండిపోతున్న పంటలకు ఊపిరి పోయగా, అధిక వర్షం కారణంగా పంటలు దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల పత్తి నేలకొరిగింది. హాలహర్వి, ఆస్పరి, ఆలూరులో పంట నీట మునిగిపోయింది. మంత్రాలయంలో అత్యధికంగా 189.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదయింది. హాలహర్విలో 128.6, కోసిగిలో 96.2, క్రిష్ణగిరిలో 94.2 వర్షం నమోదు కాగా అత్యల్పంగా ఓర్వకల్లులో 5.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదయింది. నంద్యాల జిల్లా డోన్, ప్యాపిలిలో కూడా భారీ వర్షం కురిసింది. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం లేక ఎండిపోతున్న పంటలకు ఊపిరి పోసిందంటున్నారు. అయితే అధిక వర్షం నమోదయిన ప్రాంతంలో పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడ్డారు.

అక్టోబరు 2న వికసిత్ ఏపీ విజన్ డాక్యుమెంట్

సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్టోబరు 2న వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ (ఏపీ ఏ2047) విజన్ డాక్యుమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. వికసిత్ ఏపీ విజన్ డాక్యుమెంట్ ప్రణాళిక రూపకల్పనపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో వీడియో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా వికసిత్ ఆంధ్ర ప్రదేశ్-ఏ2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్లు నీరబ్ కుమార్ ప్రసాద్ వివరించారు. ఈనెల 28న జరిగే రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ముందుకు ఈ డాక్యుమెంట్ తీసుకొస్తామని, సెప్టెంబరు 1 నుంచి 15 వరకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. సెప్టెంబరు 15-24 మధ్య విజన్ ముసాయిదా ఖరారు చేసి, అదే నెల 25న తుది ముసాయిదాను సిద్ధం చేస్తామని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఐటీ కార్యదర్శి సౌరవ్ గౌర్, విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ హరినారాయణ, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రణాళికా శాఖ జేఎస్ అనంత శంకర్, శివప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంటులో రాజదండం స్థానంలో

రాజ్యాంగాన్ని ప్రతిష్ఠించే వరకు ఉద్యమిస్తాం

తిరుపతి సదస్సులో వక్తల ఉద్ఘాటన



విశాలాంధ్ర-తిరుపతి: పార్లమెంటులో రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ప్రతిష్ఠించే వరకు ఉద్యమిస్తామని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతిలో ఏఐడీఆర్‌ఎం జాతీయ సమితి సమావేశాల సందర్భంగా దేశ పార్లమెంటులో రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్ఠించాలనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా విచ్చేసిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ప్రిన్సిపాల్ కె.వి.మురళీధర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యంత దృఢమైనదని, అలాంటి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి బీజేపీ కుటిల ప్రయత్నం చేస్తోందని, అందులో భాగంగానే దేశ పార్లమెంటులో రాజదండం ప్రతిష్ఠించారని విమర్శించారు. రాజ్యాంగాన్ని అనేక సార్లు సవరణ చేసి తనకు అనుకూలంగా పాలక ప్రభుత్వం మలుచుకుంటుందని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్య స్థానంలో రాచరిక వ్యవస్థకు పునాది వేయాలని చూస్తున్నారని, ఇది యావత్ దేశ ప్రజలు గమనిస్తున్నారని, దీనికి బీజేపీ భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యు జి.ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను ధ్వంసం చేస్తూ అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ కార్పొరేట్ కబంధ హస్తాలలో దేశాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. మహిళ, కార్మిక, కర్షక యావత్ ప్రజలు కుల మత కల్లోలంలో కొట్టుమిట్టాడుతుంటే ప్రధాని మోదీ చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులు మాగంటి గోపాల్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా ఐక్య సంఘటన పోరాడుతుందని స్పష్టం చేశారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జై ప్రభాకర్, కరవది సుబ్బారావు మాట్లాడుతూ పార్లమెంటులో రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ప్రతిష్ఠించడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమంలో భాగంగా డీహెచ్‌పీఎస్ సదస్సులు, సమావేశాలు, వివిధ రకాల ఉద్యమ కార్యక్రమాలతో అగ్రభాగాన నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి ప్రజలు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నాగరాజు, జిల్లా నాయకులు జె.రామచంద్రయ్య, బొడ్డు నాగభూషణం, చిన్నం కాళయ్య, డా.ఆర్.బలరామ్, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య బృందం అభ్యుదయ గేయాలు ఆలపించారు. ఎస్.గుర్రప్ప, జింక నాగరాజు, తులసిరాజన్, డి.మహేష్, ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

23లోగా ఆర్టీసీ ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బదిలీ అవసరమైన పీటీడీ ఉద్యోగులందరూ ఈనెల 23లోగా సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉమ్మడి జోన్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఆయా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు బదిలీ దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ఆర్టీసీ ఉద్యోగులకు బదిలీలపై మార్గదర్శకాలను వెల్ల డించిన మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

సంపాదకీయం

ప్రకృతి విపత్తులపై సన్నద్ధత ఏది?

కరువొచ్చినా, వరదొచ్చినా.. జనం ఖర్మ అన్నట్లుగా ఉంటోంది మన పాలకుల తీరు. ప్రకృతి విపత్తుల వేళ- కష్టనష్టాల నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన కార్యాచరణతో ముందస్తు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు ఆ దిశగా అడుగులు వేసినా కేంద్రం నుంచి తగిన సహాయ సహకారాలు అందక అల్లాడిపోతున్నాయి. కొద్దిరోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో అనేక రాష్ట్రాలు భీకర వరద బీభత్సాన్ని ఎదుర్కొంటున్నాయి. నిన్నటి దాకా దుర్భర నీటి కటకటతో అలమటించిన ప్రాంతాలు నేడు భారీ వరద తాకిడికి అతలాకు తలమైపోతున్నాయి. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్, బీహార్ తదితర రాష్ట్రాలు వరద ముట్టడితో కిందా మీదా అవుతున్నాయి. జులై నెలాఖరులో కేరళలోని వయనాడ్ జిల్లాను భారీ వర్షాలు, వరద రక్కసి కాటువేసి వేల ఇళ్లను కూల్చి వేసింది. వందలమంది అభాగ్యులను పొట్టన పెట్టుకున్నది. కొండచరియ విరిగిపడిన ఘటనలో దాదాపు 350మంది పైగా సజీవసమాధి అయ్యారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది భారీ వర్షాలు, వరదలకు ఇప్పటి వరకు అసోం, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలలో 305 మంది మృతి చెందగా పదుల వేల సంఖ్యలో నిర్వాసితులయ్యారు. ఎన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నా కేరళ ఏటా జలదాడికి గురవుతోంది. తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో మంగళవారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రధాన మార్గాలు, కాలనీలన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాంనగర్‌లో ఓ ద్విచక్ర వాహనదారుడు వరదలో కొట్టుకుపోయాడు. వరదలో కొట్టుకుపోయిన మరో కూలి మృతి చెందాడు. కాగా, నిన్నటి నుంచి కురుస్తున్న వర్షానికి ఎల్బీ స్టేడియం ప్రహరీ గోడ కూలిపోయింది. బషీర్ బాగ్ సీసీఎస్ పాత కార్యాలయానికి అనుకోని ఉన్న గోడ కూలడంతో అక్కడే పార్క్ చేసిన పోలీస్ వాహనాలు ధ్వంసమయ్యాయి. గోడ కూలే సమయంలో ఎవరు లేకపోవడం తీవ్ర ప్రమాదం తప్పింది. నగరం వివిధ ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఖైరతాబాద్ ప్రధాన మార్గంలో మోకాలిలోతు వరకు నీరు చేరింది. ముసారాంబాగ్ వద్ద మూసీ నదిలో వరద ప్రవాహం పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రాష్ట్రాలన్నీ ముమ్మర సహాయక చర్యల్లో మునిగితేలుతున్నాయి. వాతావరణ మార్పుల దుష్ప్రభావమే ఏటికేడు పోటెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాలు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పులకు అత్యధికంగా గురయ్యే దేశాల జాబితాలో భారత్ ఆరో స్థానంలో ఉంది. వాతావరణ మార్పుల పర్యవసానంగా తలెత్తిన ప్రకృతి వైపరీత్యాలలో 1998 నుంచి 2017 మధ్య కాలంలోనే ప్రపంచంలో 5లక్షల 26వేల మంది బలయ్యారనీ, మూడు లక్షల 47వేలకోట్ల డాలర్ల ఆస్తినష్టం వాటిల్లిందని 52దేశాలకు చెందిన వందమంది నిపుణులు రూపొందించిన నివేదిక వెల్లడించింది. వరదలు, కరువులు, తుపానులు తదితర ప్రకృతి వైపరీత్యాలతో ప్రపంచ ప్రజలకు ఆహార భద్రత కొరవడుతోందని కూడా ఆ నివేదిక హెచ్చరించింది. ఒక్క వరదల వల్ల ఈ ఇరవైఏళ్లలో ప్రపంచంలో 2.3బిలియన్ల మంది నష్టపోయారు. 1950–2015 మధ్యకాలంలో భారత్‌లో 268 భారీ వరదలు సంభవించగా కోటీ 70 లక్షలమంది నిర్వాసితులయ్యారనీ, 69 వేలమంది మృత్యువాత పడ్డారని అంతర్జాతీయ విపత్తుల సమాచార నిధి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జూన్ నెలలో తొలకరి వర్షాల వల్ల సంభవించిన వరదల్లో మన దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు నిర్వాసితులయ్యారు. వరద నీటిలో చిక్కుకున్న అనేక గ్రామాల ప్రజలు నిత్యావసరాలకు నానా యాతన పడ్డారు.

వాతావరణ మార్పు, భూతాపం అనివార్యమైన నేపథ్యంలో ఏటా ఏదో ఒక స్థాయిలో వరదలు సంభవిస్తున్నా... వాటి వల్ల కలిగే నష్టాలను తగ్గించుకునేందుకు శాశ్వత చర్యలను చేపట్టే విషయంలో పాలకులు పూర్తి నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారు. మన దేశంలో నూట పాతికపైగా భిన్న వాతావరణ జోన్లు ఉన్నాయి. వీటిలోని సేద్యయోగ్య భూమిలో 68శాతానికి కరవు ముప్పు, అయిదు కోట్ల హెక్టార్లకు వరద ముంపు ప్రమాదం పొంచి ఉన్నదని వాతావరణ నిపుణులు ఎప్పుడో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రకృతి విపత్తుల నివారణ యంత్రాంగాన్ని అన్ని స్థాయిల్లోనూ పరిపుష్టం చేసుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. భూకంపాల విలయాన్ని ఎదుర్కొనడంలో జపాన్ విజయగాథ మనకు స్ఫూర్తిగా నిలవాలి. దేశంలో వాతావరణ విపత్తులకు లోనయ్యే 151 జిల్లాలను గుర్తించినట్లు, వాటిని కాపాడుకునేందుకు పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేసినట్లు మోదీ ప్రభుత్వం చాలా కాలం క్రితం రాజ్యసభలో ప్రకటించింది. కానీ ఆ కార్యాచరణ ప్రణాళిక దాఖలాలేవీ ఆచరణలో కనిపించడంలేదు. వరదలు వచ్చినప్పుడు తూతూ మంత్రంగా ఆదరబాదరగా లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించడం, తాత్కాలిక కేంద్రాలు ఉంచి పదో పరకో నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం సర్వసాధారణమైపోయింది. ఏయే ప్రాంతాల్లో ఏ స్థాయిలో వరదలు వస్తున్నాయో గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం, ఆ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా చూడడం వంటి ముందస్తు ప్రణాళికలు కొరవడ్డాయి. నదీ ప్రవాహాలకు రకరకాల ఆటంకాలు కలగడం వల్ల వరదలు పల్లెలు, పట్టణాలను ముంచెత్తుతున్న వాస్తవాన్ని పాలకులు గుర్తించాలి. ఆకస్మికంగా వరదలు వచ్చిపడినప్పుడు అతి తక్కువ సమయాల్లో భారీ సంఖ్యలో జనాన్ని సరక్షిత ప్రాంతాలకు చేర్చడానికి తగిన పటిష్టమైన వ్యవస్థలను సంసిద్ధంచేసుకోవాలి. నదుల పొడవునా అవసరమైన మేరకు రిజర్వాయర్లు నిర్మించితే వరద తీవ్ర తగ్గించడంతోపాటు నీటిని పొదుపు చేసుకొనే వీలు కలుగుతుంది. రుతువులు గతి తప్పడం వల్ల వ్యవసాయ రంగం, ఆహారభద్రతపై తీవ్ర ప్రభావం కలుగుతుందన్న వాస్తవాన్ని గుర్తెరగాలి. అందుకు అనుగుణంగా తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలి. అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకొని అందుకు అనువైన రీతిలో నివారణోపాయలను పాటిస్తే వరదల ముప్పు చాలా వరకు అదుపులోకి వస్తుంది. అదే సమయంలో ప్రజల్లో సామాజిక చేతన పెంపొందించాలి. అప్పుడే ప్రకృతి వైపరీత్యాల దుష్ప్రభావాల నుంచి దేశాన్ని, ప్రజలను సురక్షితంగా బయటపడేయగలుగుతారు.

యూపీలో పట్టుకు శ్రమిస్తున్న కాంగ్రెస్

ప్రదీప్ కపూర్

దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో పూర్వవైభవాన్ని పొందేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. దళితులు, ఓబీసీలు, మైనారిటీల మనస్సును గెలుచుకునేందుకు భారీ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలలో చెప్పుకోతగ్గ స్థాయిలో సీట్లు గెలుచుకోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ పటిష్టతకు నాయకత్వం వివిధ కార్యక్రమాలను రూపొందిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒకే ఒక్క లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుంది. 2024 ఎన్నికలలో ఆ సంఖ్య ఆరుకు పెరగడం పార్టీ శ్రేణులలో నూతనోత్తేజాన్ని నింపింది. మిగిలిన నియోజకవర్గాలలో కూడా 50వేల లోపు ఓట్ల తేడాతోనే పరాజయం పొందారు. ఈ ఎన్నికలలో

కాంగ్రెస్ పార్టీ ఓట్ల శాతం కూడా గణనీయంగా పెరిగింది. ఓబీసీలు, దళితులు, మైనారిటీల మనస్సును గెలుచుకునేందుకు రాహుల్ గాంధీ మిషన్‌ను గ్రామ స్థాయికి విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే క్విట్ ఇండియా దినం అయిన ఆగస్టు 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ లక్నోలో ఓబీసీ సెల్, మైనారిటీ సెల్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహించి భారీ బహిరంగ చేరువ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణకు వ్యతిరేకంగా, కులాధారిత జనగణన నిర్వహించడం, రిజర్వేషన్ కోటా 50శాతానికి పైగా పెంచడం వంటి సమస్యలపై ప్రజా చైతన్యం రగిలించాలని సమావేశం నిర్ణయించింది.

ఆగస్టు 9వ తేదీన ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని సెప్టెంబరు 11వ తేదీ వరకు కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ నిర్ణయించింది. దీనితోపాటు రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉండగా 1989లో రూపుదిద్దుకున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు అమలులోకి వచ్చి 35 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తలపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు వివిధ సంఘాలతో సంప్రదింపులు జరుపుతారు. వారితో సంబంధం కలిగివుంటారు. ప్రజలను చైతన్యపరిచేందుకు రాష్ట్ర రాజధాని నుంచి గ్రామ స్థాయి వరకు సెమినార్‌లు, సభలు, వీధి సమావేశాలు నిర్వహిస్తున్నారు. సామాజిక న్యాయం, కులాధారిత జనగణన, 50శాతానికి పైగా రిజర్వేషన్ల పెంపు వంటి సందేశాన్ని వ్యాప్తి చేస్తున్నారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఇటీవల చట్ట సవరణ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. కుల ఆధారిత జనగణనకు సంబంధించి ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సంతకాలు కూడా సేకరిస్తున్నారు. రాష్ట్రంలోని దళితులకు చేరువకావడానికి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ కొన్ని కార్యక్రమాలను ప్రారంభించింది. జులైలో ప్రారంభించిన భాగిధరి దివస్ సత్ఫలితాలివ్వడం మొదలైంది. దళితుల హృదయాలను గెలుచుకునేందుకు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ చిత్రాలతో పోస్టర్లను కూడా కాంగ్రెస్ పార్టీ రూపొందించింది. బీఎస్పీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకున్న దళిత నాయకులకు ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీలో కీలక పదవులు వారికి కట్టబెడుతోంది. గడిచిన కొద్ది నెలలుగా బీఎస్పీకి భారీ గండిపడుతోంది. సీనియర్ నాయకులు, పార్టీ సమన్వయకర్తలు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో బీఎస్పీకి రాజీనామా చేస్తున్నారు. వారిలో అత్యధికులు సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం రాహుల్ గాంధీ మిషన్ 2027లో భాగంగా దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు కీలక పదవులు కట్టబెట్టి పార్టీ పునర్నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సమాయత్తమౌతోంది. పార్టీ పాత ఓటుబ్యాంక్ అయిన బ్రాహ్మణులు, దళితులు, మైనారిటీలను నిలుపుకునేందుకు మాత్రమే కాకుండా ఓబీసీలను కూడా పెద్ద ఎత్తున ఆకర్షించేలా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు ఉంటున్నాయి. జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న మత్స్యకారుల కోసం సంఘం ఉండాల్సిన అవశ్యకత, సంఘం ప్రాధాన్యతపై కాంగ్రెస్ పార్టీకి మంచి అవగాహన ఉంది. అందుకే సమాజంలో అత్యధిక ప్రాధాన్యత కలిగిన మత్స్యకారుల కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసింది. సమాజంలోని వివిధ వర్గాలకు పార్టీలో ప్రాధాన్యత ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర వ్యవహారాలలో తీవ్ర ఆసక్తి చూపుతున్నారనే అభిప్రాయాన్ని సమాజంలోని వివిధ వర్గాల వారిలో కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. టికెట్ల పంపిణీలో తమకు సరైన భాగస్వామ్యం లభిస్తుందనే భావన వారికి కలిగే విధంగా కాంగ్రెస్ పార్టీ విధానాలు, కార్యక్రమాలు ఉంటున్నాయి.

వైద్యులకు సామాజిక భద్రత అవశ్యం

డా.జ్ఞాన్ పాఠక్

దేశమంతటా వైద్యుల రక్షణకోసం సుప్రీంకోర్టు జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను (ఎన్‌టిఎఫ్) ఏర్పాటుచేసింది. కోల్‌కతాలో ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం జరిపి హత్యచేసిన కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ నాయకత్వంలో ధర్మాసనం విచారణ చేసింది. రెండు విభాగాలపై ఎన్‌టిఎఫ్ అధ్యయనం చేయాలని సుప్రీంకోర్టు కోరింది. వైద్యనిపుణులకు వ్యతిరేకంగా స్త్రీ, పురుషుల ఆధారంగా జరిగే హింసను నిరోధించడం, ట్రైనీ డాక్టరు, రెసిడెంట్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, ఇతర డాక్టర్లు పనిచేసేచోట భద్రతా చర్యలపైన ఒక పత్రాన్ని రూపొందించాలని కోర్టు కోరింది. వైద్యులపై హింసాకాండను నిరోధించేందుకు అవసరమైన చర్యలు అంటే ఆసుపత్రిలో భద్రతకు హామీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు శిక్షణపొందే వారికి ఇబ్బందులు ఎదురైనప్పుడు సంక్షోభం ఏర్పడినప్పుడు కౌన్సిలింగ్ కోసం నిపుణులను తీసుకోవాలని కోర్టు సూచించింది. సంక్షోభ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై వర్క్‌షాపులు నిర్వహణతోపాటు పనిచేసే ప్రదేశాల్లో మహిళలను సెక్సుపరంగా హింసించకుండా నిరోధించేందుకు శ్రద్ధ వహించాలి. వైద్య వృత్తిదారులకు ఆసుపత్రులలో, నర్సింగ్‌హోమ్‌లలో, ప్రైవేటు ఆరోగ్యభద్రత సౌకర్యాలు ఉండేవిధంగా చర్యలకోసం చట్టం చేయాలి. ఈ చట్టాన్ని కేవలం వైద్యులకే కాకుండా ఇంటర్న్‌షిప్ పొందుతున్న జూనియర్లకు, రెసిడెంట్ డాక్టర్లకు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు, నర్సులకు వర్తింపచేయాలి. డాక్టర్ల భద్రతకోసం మార్గదర్శకాలను సూచించడంపై మూడు వారాలలో తాత్కాలిక నివేదికను, తుది నివేదికను మూడునెలలలోపు ఎన్‌టిఎఫ్ అందించాలి.

ప్రతి ఆసుపత్రిలో ఎంతమంది భద్రతాసిబ్బందిని తీసుకున్నదీ అన్ని రాష్ట్రాల ఆసుపత్రుల నుంచి సమాచారాన్ని సేకరించాలి. ఎన్ని విశ్రాంతి గదులు ఉన్నదీ సంబంధిత సౌకర్యాల కల్పన ఆసుపత్రులలో ప్రజలకు అందుబాటులో ఉంచే ప్రాంతాల సమాచారం ఇతర సంబంధిత అంశాలపై నెలరోజులలోపు రాష్ట్రాలు నివేదించాల్సిఉంది. సీబీఐ ఇంతవరకుచేసిన దర్యాప్తుకు సంబంధించిన నివేదికను ఆగస్టు 22 గురువారం అందించాలి. ఆర్‌జి కర్ ఆసుపత్రిపైన ఆగస్టు 14వ తేదీన సమూహాలు సృష్టించిన విధ్వంసం, హింసాకాండపై వివరణ ఇవ్వాలి. అదేరోజు జరిగిన విధ్వంసంపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వ నివేదికను అందించాలి. ఆర్‌జి కర్ ఆసుపత్రికి అదనపు భద్రతను,

> పనిచేసేచోట భద్రత లేకపోవడం అంటే మహిళలకు సమానత్వాన్ని తిరస్కరించడమే అవుతుంది. పని ప్రదేశాల్లో భద్రతకు హామీ ఉండాలి. ప్రత్యేకించి 36గంటలు పనిచేసే వైద్యులకు భద్రత తప్పనిసరి. ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జరిగిన ఘటనపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేసు నమోదుకు ఎందుకు జాప్యం చేసిందని కోర్టు ప్రశ్నించింది. ఆసుపత్రులలో రాత్రింబవళ్లు వైద్యులు తమ విధి నిర్వహణలోఉంటున్న సమయంలో తప్పనిసరిగా భద్రత కల్పించాలి.

నివాస భవనాలను ఖాళీచేసిన వారికి భద్రత కల్పించాలని సీఐఎస్‌ఎఫ్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఈ సున్నితమైన అంశాన్ని పోలీసులు, ప్రిన్సిపాల్ ఎలా నిర్వహించారని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇంటర్న్‌షిప్ పొందుతున్నవారు, రెసిడెంట్ డాక్టర్లు, ముఖ్యంగా 26 గంటలు పనిచేసిన మహిళా వైద్యులకోసం ఎలాంటి భద్రతా చర్యలు తీసుకున్నారో ఒక నివేదికను పంపాలి. మీడియాలో బాధితురాలిపేరును చెప్పడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

జీవితాన్ని కోల్పోయిన యువ వైద్యురాలి పట్ల ఏమాత్రం గౌరవం చూపలేదని మీడియా చేయవలసినవని ఇదేనా అని ధర్మాసనం ప్రశ్నించింది. పనిచేసేచోట భద్రత లేకపోవడం అంటే మహిళలకు సమానత్వాన్ని తిరస్కరించడమే అవుతుంది. పని ప్రదేశాల్లో భద్రతకు హామీ ఉండాలి. ప్రత్యేకించి 36గంటలు పనిచేసే వైద్యులకు భద్రత తప్పనిసరి. ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జరిగిన ఘటనపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేసు నమోదుకు ఎందుకు జాప్యం చేసిందని కోర్టు ప్రశ్నించింది. ఆసుపత్రులలో రాత్రింబవళ్లు వైద్యులు తమ విధి నిర్వహణలోఉంటున్న సమయంలో తప్పనిసరిగా భద్రత కల్పించాలి. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమైందని అన్నారు. వైద్యకళాశాలల్లో ఒకేసారి 7000 మంది ప్రవేశించడం పోలీసులకు తెలియకుండా జరగదు. ఆ సమయంలో విధ్వంసం జరిగిందని తుషార్‌మెహతా అన్నారు. అయితే ఇక్కడి ప్రతిపక్ష ప్రభుత్వంపై ఎలాగైనా తీవ్ర చర్య తీసుకోవాలన్న ఉద్దేశం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఉన్నదనిపిస్తోంది.

నిరసనలు అణచివేసేందుకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తన అధికారాలను వినియోగించిందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఎఫ్‌ఐఆర్ నమోదుకు 3గంటల సమయం ఎందుకు పట్టిందని కోర్టు విమర్శించింది. ప్రభుత్వం తరఫున న్యాయవాది కపిల్‌సిబల్ మాట్లాడుతూ, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌ను సెలవు పెట్టాలని కోల్‌కతా హైకోర్టు ఆదేశించిందని సుప్రీం దృష్టికి తెచ్చారు. ఈ వ్యవహారాలపై సిట్ దర్యాప్తు చేస్తున్నదని సిబల్ వెల్లడించారు. పరిస్థితి తీవ్రతరం కావడానికి సోషల్‌మీడియా కారణమని ఆయన విమర్శించారు. ఆగస్టు 14న విధ్వంసం చేసినవారిలో 37మందిని అరెస్టుచేసి 50మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లుగా కూడా సిబల్ తెలిపారు. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 22కు వాయిదావేసింది. సీబీఐ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తన నివేదికలను ఆ రోజుకు సమర్పించగలదన్న ఆశాభావాన్ని కోర్టు వ్యక్తం చేసింది. విధ్వంసం, నేరం జరిగిన చోట సాక్ష్యాన్ని చెరిపివేశారన్న అంశాన్ని నివేదికలో తెలియజేయాలని కోరింది.

ఈ టాస్క్‌ఫోర్స్‌లో మొత్తం 10మంది సభ్యులు ఉంటారు. ఆర్‌కె సరియన్, సర్జన్, (వైస్ అడ్మిరల్), నేషనల్ గ్యాస్ట్రోలజీ ఆసియన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఎయిమ్స్ (ఢిల్లీ) డైరెక్టర్ డాక్టర్ ఎమ్ శ్రీనివాస్, బెంగళూరుకు చెందిన నిమ్‌హాన్స్ డాక్టర్ ప్రతిమా మూర్తి, ఎయిమ్స్(జోధ్‌పూర్) డైరెక్టర్ డాక్టర్ పురి, గంగారామ్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ రావత్, బిడి శర్మ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అనితా సక్సేనా, డాక్టర్ పల్లవి, డాక్టర్ పద్మ శ్రీవత్సవ్ టాస్క్‌ఫోర్సులో ఉన్నారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా కాబినెట్ కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శి, నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్, నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినర్ అధ్యక్షులు ఉంటారు.

ఎరువులపై మాటలే చేతల్లేవు !

బొల్లిముంత సాంబశివరావు

ఎవరు ఏమి చెప్పినా, ఎవరు కాదన్నా భారతదేశం వ్యవసాయక దేశమే. అత్యధిక ప్రజలు సేద్యంపై ఆధారపడి గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. 'స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా వ్యవసాయరంగంలో అభివృద్ధి నత్తనడకన సాగుతున్నది. పంటల దిగుబడులకు కీలకమైన ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేకపోయాం. ఫలితంగా ఎరువుల కొరతను తీర్చటానికి దిగుమతులపై ఆధార పడుతున్నాం. స్వయం సమృద్ధి సాధిస్తామని పాలకులు చెపుతున్నారు. ఇది మాటలకే పరిమిత మౌతున్నది. సుదీర్ఘకాలంగా కొత్తగా ఎరువుల కర్మాగారం ఒక్కటి కూడా ప్రభుత్వాలు నిర్మించకపోవడం ఎరువుల రంగంలో పాలకుల వైఫల్యానికి అద్దం పడుతున్నది. 1956 నాటి పారిశ్రామిక విధాన తీర్మానం ప్రకారం ప్రభుత్వ యాజమాన్యం కిందికి వచ్చిన నూతన సంస్థల స్థాపనలో ప్రభుత్వమే చొరవ తీసుకునే పరిశ్రమల్లో ఎరువుల పరిశ్రమ కూడా ఒకటి. అనేక ఇతర పరిశ్రమల్లో లాగానే ఈ పరిశ్రమ కూడా కాలక్రమేణా దాదాపు పూర్తిగా విదేశీ సంస్థలపై ఆధారపడే విధంగా తయారైంది. ట్రాంబే వద్ద ప్రభుత్వరంగంలో నెలకొల్పదలచిన ఎరువుల కర్మాగారానికి రుణసహాయం కోసం అమెరికన్ గుత్త పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకున్నప్పటి నుంచి (1956–59) వారికిచ్చిన రహస్య వాగ్దానానికి అనుగుణంగా ప్రైవేట్‌రంగ ఎరువుల పరిశ్రమలో విదేశీ పెట్టుబడి చొరబడేందుకు భారత ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని 'తాకట్టులో భారతదేశం' అనే మహత్తర గ్రంథంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల నాయకుడు తరిమెల నాగిరెడ్డి వివరించారు. దేశంలో ఎరువుల ఉత్పత్తికోసం ఆర్థిక సహాయం, సాంకేతిక పరిజ్ఞానంకోసం విదేశీ గుత్త సంస్థలపై ఆధారపడటంతో దేశంలో అపారంగా లభించే ముడిపదార్థమైన బొగ్గును వినియోగించే కొత్త ఎరువుల కర్మాగారాలు పెట్టే క్రమం ఆగిపోయింది. విదేశీ కంపెనీల ప్రాబల్యం కింద ఉన్న రిఫైనరీల నుంచి లభ్యమయ్యే నాప్తా లేదా దిగుమతి చేసుకోవలసిన ద్రవరూపంలో వున్న అమ్మోనియాను ముడి పదార్థాలుగా ఉపయోగించే కర్మాగారాలపైనే ఆధారపడి వాటిని దిగుమతి చేసుకొని ఎరువుల ఉత్పత్తి చేయాల్సి వచ్చింది.

ప్రస్తుతం దేశంలో ఎరువుల ఉత్పత్తి 42.45 మిలియన్ టన్నులు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్ ఎఫ్‌సీఒ) కృషక్ భారత్ కో ఆపరేటివ్ లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, గుజరాత్ స్టేట్ ఫెర్టిలైజర్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, జువారి ఆగ్రో కెమికల్స్ లిమిటెడ్, చంబల్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్, నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్, దీపక్ ఫెర్టిలైజర్స్ అండ్ పెట్రో కెమికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్, మంగళూరు కెమికల్స్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, ఇండో గల్ఫ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, పరదీప్ ఫాస్ఫేట్స్ లిమిటెడ్, సదరన్ పెట్రో కెమికల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎరువుల ఉత్పత్తి పరిశ్రమలుగా ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలు ఎరువులు ఉత్పత్తి చేయటానికి కావాల్సిన ముడి పదార్థాలను, సాంకేతికతను నేటికి విదేశీ కంపెనీల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఫలితంగా మన ఎరువుల కర్మాగారాలు విదేశీ కంపెనీల ముడిపదార్థాలపై నేటికీ ఆధాపడి ఉన్నాయి. ముడి పదార్థాలపై దిగుమతి కోసం పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం చెల్లిస్తున్నాం. దేశంలో ఎరువుల ఉత్పత్తి 42.45 మిలియన్ టన్నులు కాగా 2020లో వినియోగం 62 మిలియన్ టన్నులుగా ఉంది. వినియోగంలో 55శాతం యూరియా ఉంది. ఒక అధ్యయనం ప్రకారం 1960లో భారతదేశంలో ఎరువుల వినియోగం పది లక్షల టన్నుల కంటే తక్కువ. 2000 సంవత్సరం ప్రారంభంలో కోటి 70 లక్షల టన్నులకు, 2019 కి సంబంధించిన డేటా ప్రకారం 5 కోట్ల టన్నులకు, 2023 నాటికి 7 కోట్ల పది లక్షల టన్నులకు చేరింది. దేశంలో హరితవిప్లవం అమల్లోకి వచ్చిన తర్వాత ఎరువుల వినియోగం పెరుగుదల ప్రారంభమైంది. రసాయనిక ఎరువుల వినియోగం వలన భూమి సారం కోల్పోయి గుల్లబారుతూ ఆ ఎరువులు వాడందే పంట దిగుబడి రాని పరిస్థితుల్లో ఎరువుల వాడకం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఎరువుల అతిపెద్ద దిగుమతి దేశాల్లో భారతదేశం రెండవ స్థానంలో ఉంది. మోదీ ప్రభుత్వ పాలనలో దిగుమతులు తీవ్ర రూపం దాల్చాయి. 2021లో 6,523.53 మిలియన్ల డాలర్ల విలువైన యూరియా, 4,169.95 మిలియన్ల డాలర్ల విలువైన ఫాస్ఫేట్ ఎరువులు, 1036.79 మిలియన్ డాలర్ల విలువైన పొటాషియం ఆధారిత ఎరువులు దిగుమతి చేసుకున్నది. 2021–22లో దిగుమతి చేసుకున్న అన్ని రకాల ఎరువుల మొత్తం విలువ 12,765.66 మిలియన్ల డాలర్లుగా ఉంది. ఇదే సమయంలో భారత్ 2.5 కోట్ల టన్నుల యూరియా, 42 లక్షల టన్నుల డీఏపీ, 83 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 33 లక్షల టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఉత్పత్తి చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. ఈ ఎరువుల ఉత్పత్తికి కావాల్సిన మొత్తం ముడి పదార్థాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నాం. దీన్ని గమనిస్తే దిగుమతి చేసుకున్న ముడి సరుకును దేశీయ ఫ్యాక్టరీల్లో ఎరువులుగా తయారుచేశారే తప్ప సొంతంగా ఉత్పత్తి చేయలేదని వెల్లడౌతున్నది. యూరియా ఉత్పత్తిలో 2000 నాటికి సాధించిన స్వయం సమృద్ధి, ఆ తర్వాత ఉత్పత్తి తిరోగమనంలో

పయనించింది. దేశంలో అమలు జరిపిన సరళీకరణ విధానాల వలన ప్రభుత్వరంగంలో పెట్టుబడుల అవసరం లేదని పాలకుల నిర్ణయంగా ఉంది. ఫలితంగా 1995 నుంచి పెట్టుబడులు నామమాత్రమయ్యాయి. వాజ్‌పేయి పాలనలో 2002లో బొగ్గు, నాప్తా, లిగ్నైట్‌తో పనిచేసే అనేక ప్లాంట్లు మూసివేశారు. మోదీ ప్రభుత్వం కూడా ప్రభుత్వ రంగ యూనిట్లను విస్తరించక పోవటం, కొన్ని ఆపరేటింగ్ యూనిట్లను మూసి వేయటంతో ఎరువుల ఉత్పత్తి ప్రైవేట్ రంగంలోకి వెళ్లింది. ఫలితంగా యూరియాతో పాటు ఇతర ఎరువులను దిగుమతి చేసుకోవటం అనివార్యమైంది. (ఫెర్టిలైజర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా) నుంచి వచ్చిన డేటా ప్రకారం గత 30 సంవత్సరాల్లో ఎరువుల పదార్థాల వినియోగం 3.3శాతం వార్షిక వృద్ధి రేటుగా ఉంటే, ఉత్పత్తి మాత్రం 2.18 శాతం మాత్రమే పెరిగింది. ఫలితంగా భారీగా దిగుమతులు అవసరమయ్యాయి. ప్రధానంగా ఎరువుల దిగుమతులు రష్యా, చైనా, ఉక్రెయిన్, ఇండోనేషియా, సౌదీ అరేబియా తదితర దేశాల నుంచి జరిగింది. దేశంలో వ్యవసాయంపై హర్మ్‌దేవ్ నారాయణ్ యాదవ్ అధ్యక్షుడుగా ఉన్న స్టాండింగ్ కమిటీ వ్యవసాయం, అనుబంధ రంగాలపై రసాయనిక ఎరువుల, పురుగుమందుల ప్రభావంపై 11-8- 2016న మోదీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దేశంలో వ్యవసాయ ఉత్పత్తితోపాటు ఎరువులు వినియోగం పెరుగుతున్నదని నివేదిక పేర్కొన్నది. 1960లో వ్యవసాయ ఉత్పత్తి 83 మిలియన్ల టన్నులుగా ఉంటే 2014 నాటికి 252 మిలియన్ల టన్నులకు పెరిగిందని, రసాయనిక ఎరువుల వాడకం ఒక మిలియన్ టన్నుల నుంచి 25.6 మిలియన్ల టన్నులకు పెరిగిందని కమిటీ నివేదిక పేర్కొంది.

మన దేశానికి ఎరువులు దిగుమతిచేసే దేశాలు లాబీగా ఏర్పడి రేట్లను, డిమాండ్‌ను నియంత్రిస్తున్నాయి. కోవిడ్ తర్వాత పెరిగిన డిమాండ్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా 2021 నుంచి గ్యాస్ ధరలు పెరుగుతూ ఉన్నాయి. దాని ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో 2020-21 వార్షిక సంవత్సరంలో డీఏపీ టన్ను ధర 383 అమెరికా డాలర్ల నుంచి 560 డాలర్లకు, పొటాష్ 230 నుంచి 280 డాలర్లకు,అమ్మోనియా 210 నుంచి 450 డాలర్లకు, ఫాస్ఫారిక్ ఆమ్లం 590 నుంచి 998 డాలర్లకు, సల్ఫర్ 85 నుంచి 220 డాలర్లకు ధరలు పెరిగాయి. 2022 నాటికి అమ్మోనియా టన్నుకు 330 నుంచి 990 అమెరికన్ డాలర్లకు పెరిగింది. భారతదేశాని దిగుమతి అయ్యే ప్రధాన ఎరువుల పదార్థమైన యూరియా, డీఏపీ విషయంలో కూడా ఇదే విధంగా ధరలు పెరిగాయి. భారతదేశంలో ఎరువుల ధరల నిర్ణయం నుంచి మోదీ ప్రభుత్వం వైదొలిగి, ధరల నిర్ణయం ఎరువుల కంపెనీలకే అప్పగించటం అంటే, వాటి దోపిడీకి అనుమతి ఇవ్వటమే. ధరల నిర్ణయం కంపెనీ చేతుల్లోకి వెళ్లిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా దాదాపు దేశంలో 13 సార్లు ఎరువుల ధరలు పెరిగాయి. మోదీ ప్రభుత్వ పాలనలోనే ఎరువుల ధరల పెరుగుదల పరంపర ప్రారంభమైంది. 2015 ముందు 50 కిలోల బస్తా రూ.360 లోపు ఉన్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఆ తర్వాత విపరీతంగా పెరిగాయి. 2021లో రూ.1200 ఉన్న డీఏపీ 2022 నాటికి రూ.1350, ఇదే కాలంలో 20–20–0 ఎరువు రూ.975 నుంచి రూ.1400, 10–26–26 రూ.1176 నుంచి రూ.1500, పొటాష్ రూ.1000 నుంచి రూ.1350 పెరిగాయి.

2024 సంవత్సరం ఎంవోసీ (పొటాష్) బస్తా ధర 1623 రూపాయలకు, డీఏపీ రూ. 1414, 28–28–0 రూ.1700 నుంచి 1780 కు, 14–35–14 ఎరువు ధర రూ.1700 నుంచి రూ.1780 కి, యూరియా రూ.266 నుంచి రూ.280 రూపాయలకు ధరలు పెరిగాయి. ఈ ఎరువుల ధరలే కాక మిగతా ఎరువుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. పాలకుల విధానాల ఫలితంగా ఎరువుల ధరలు పెరగడంతో సేద్యపు ఖర్చులు పెరిగి రైతాంగం సంక్షోభంలో మునిగిపోయారు. భారత పాలకులు కంపెనీలకే ఎరువుల ధరల నిర్ణయాన్ని కట్టబెట్టటం, ఎరువుల ఉత్పత్తి ప్రైవేట్‌రంగం ఆధిపత్యంలోకి వెళ్లటం, విదేశాల నుంచి దిగుమతులు పెరగటం, కొత్తగా ఎరువుల ఫ్యాక్టరీలు స్థాపించకపోవటం రైతాంగం సంక్షోభానికి ప్రధాన కారణం. ఈ పరిస్థితులు మారాలంటే దిగుమతులపై ఆధార పడకుండా ఎరువుల ఉత్పత్తిలో దేశం స్వయం సంవృద్ధి సాధించాలి. అందుకోసం ప్రభుత్వరంగలో పరిశ్రమల విస్తరణ జరగాలి.

సెల్: 9885983526

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం పాలసీకి సంబంధించిన సీబీఐ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు మంగళవారం పొడిగించింది. కేజ్రీవాల్ కస్టడీ ముగియడంతో సీబీఐ ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచింది. ఈ సందర్భంగా కోర్టు కస్టడీని ఈ నెల 27 వరకు పొడిగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఉత్తర్వులు వెలువరించారు. ఈ నెల 14న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ స్పందన కోరింది. కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. సీబీఐ ఆయనను అరెస్టు చేయడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించిన విషయం తెలిసిందే. సీబీఐ కేసులో ట్రయల్ కోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్ కోసం ఆశ్రయించాలని సూచించింది.

నిరసన హోరు... నిలిచిన రైళ్లు

- ఇద్దరు కేజీ పిల్లలకు లైంగిక వేధింపులు
- మహారాష్ట్రలోని స్కూలులో ఘటన - నిందితుడు అరెస్టు
- ప్రిన్సిపల్, టీచర్ సస్పెన్షన్ - రైల్వే ట్రాక్‌లపైకి వందల మంది
- దోషులను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రుల డిమాండ్

థానె: కోల్‌కతాలో అభయకు న్యాయం కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు పెద్దఎత్తున జరుగుతున్న తరుణంలో మహారాష్ట్రలో కేజి చదవుతున్న ఇద్దరు చిన్నారులను స్కూలు అటెండెంట్ లైంగికంగా వేధించిన ఘటన వెలుగు చూసింది. థానె జిల్లాలోని బద్లాపూర్‌లోగల స్కూలులో చిన్నారుల(ఒకరికి మూడేళ్లు, మరొకరికి నాలుగేళ్లు)ను అటెండెంట్ లైంగికంగా వేధించిన ఘటన ఈనెల 17న జరిగింది. టాయిలెట్‌లో పిల్లలను అసభ్యంగా తాకి వారిని ఇబ్బంది పెట్టిన ఘనతో థానె మంగళవారం స్తంభించిపోయింది. బద్లాపూర్‌లోని స్కూలులో ఈ ఘటన జరిగింది. చిన్నారులు టాయిలెట్ ఉన్నప్పుడు దానిని శుభ్రం చేసే వంకతో వెళ్లిన అటెండెంట్ వారితో అనుచితంగా ప్రవర్తించాడు. ఆపై ఒక బాలిక మర్మాంగంలో నొప్పిగా ఉందని చెప్పడం... మరో బాలిక స్కూలుకు వెళ్లేమంటే భయపడటం వల్ల తల్లిదండ్రులు ఆరా తీశారు. పిల్లలను వైద్యుల వద్దకు తీసుకెళ్లగా లైంగిక వేధింపుల విషయం తెలిసింది. తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించగా వారు తొలుత పట్టించుకోలేదు. శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. విచారణ అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా పాఠశాల నిర్వహణలో లొసుగులు బయటకు వచ్చాయి. బాలికల టాయిలెట్ నిర్వహణకు మహిళలను కేటాయించలేదని, సీసీటీవీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదని వెల్లడైంది. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికలకు లైంగిక వేధింపులపై స్కూలు యాజమాన్యం విచారం వ్యక్తం చేసింది. క్షమాపణలు చెప్పింది. ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసింది. ఆ పిల్లల క్లాస్ టీచర్, వారి బాధ్యతలు చూస్తున్న మహిళా అటెండెంట్‌ను తొలగించింది. హౌస్‌కీపింగ్ ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టింది. స్కూలు ప్రాంగణంలో నిఘాను పెంచుతున్నట్లు ప్రకటించింది. అటెండెంట్‌ను పోలీసులు అరెస్టు చేసి అతనిపై పోక్సో కేసు పెట్టారు. తల్లిదండ్రుల నిరసనకు మద్దతుగా స్థానిక పాఠశాలలు మూతబడ్డాయి. ఇదిలావుంటే తల్లిదండ్రుల ఫిర్యాదుపై వెంటనే స్పందించని పోలీసు స్టేషన్ ఇన్‌చార్జిని బదిలీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. తల్లిదండ్రులతో పాటు స్థానికులు ఉదయం 8 నుంచి బద్లాపూర్ రైల్వేస్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందలాది మంది బ్యానర్లు, ప్లకార్డులతో ట్రాకులపైకి చేరుకోవడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దోషులను కఠినంగా శిక్షించాలన్న నినాదాలు మార్మోగాయి. అటు స్కూలు వద్ద కూడా నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్ చేసూ ఆందోళన నిర్వహించారు.

సిట్ ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశం

బద్లాపూర్‌లో చిన్నారులపై లైంగిక దాడి కేసులో విచారణకు సిట్ ఏర్పాటునకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రత్యేక దర్యాప్తు బృందానికి పోలీసు ఐజీ స్థాయి అధికారి ఆర్తీ సింగ్ నేతృత్వం వహిస్తారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి దేవంద్ర ఫడ్నవీస్ ఎక్స్‌లో తెలిపారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించేలా ప్రతిపాదనను సిద్ధంచేయాలని థానె పోలీసు కమిషనర్‌కు ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు.

మహిళల భద్రతకు భరోసా ఏదీ

ప్రియాంక చతుర్వేది

ముంబై: మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో స్కూల్ చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటన తీవ్ర విచారకరమని శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు. పాలకులు మహిళా హక్కుల కోసం పోరాడతామని, వారికి న్యాయం చేస్తామని ప్రతిసారీ చెబుతుంటారని, కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత మహిళల సమస్యలను ఏ ఒక్కరూ వినిపించుకోరని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ముఖ్యమంత్రి లడ్కీ బహిన్ యోజన పథకం కింద ఎలాంటి ప్రయోజనాలు అవసరం లేదని, మహిళల భద్రతే ముఖ్యమని బద్లాపూర్ ఘటనకు నిరసన వ్యక్తం చేస్తున్న వారు కోరుతున్నారని ఆమె వివరించారు. ఇలా ఎంతకాలం మహిళలకు అన్యాయం చేస్తుంటారని ప్రియాంక చతుర్వేది ప్రశ్నించారు.

బద్లాపూర్ ఘటనపై సిట్: షిండే

ముంబై: మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ స్కూల్ చిన్నారులపై సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన దుమారం రేపుతోంది. ఈ ఘటనపై సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. బద్లాపూర్ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనిపై ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఘటన జరిగిన పాఠశాలపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ ప్రక్రియలో దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షిస్తామని సీఎం వెల్లడించారు. దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ప్రిన్సిపల్, క్లాస్ టీచర్, సంబంధిత సిబ్బందిని అధికారులు సస్పెండ్ చేశారు.

మూడు మాల్స్‌కు , ఆసుపత్రికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశంలో బాంబు బెదిరింపులు పర్వం కొనసాగుతోంది. పాఠశాలలు, విమానాశ్రయాలు, కార్యాలయాలు, నేతలకు వరుస బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. గతవారం హర్యానా రాష్ట్రం గురుగ్రామ్ నగరంలోని అంబియెన్స్ మాల్ సహా నోయిడా ప్రాంతాల్లోని కొన్ని షాపింగ్ మాల్స్‌కు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దక్షిణ ఢిల్లీలోని మూడు మాల్స్‌కు, ఓ ఆసుపత్రికి బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. చాణక్యపురిలోని చాణక్య మాల్, సాకేత్ ప్రాంతంలోని సెలెక్ట్ సిటీవాక్, వసంత్ కుంజ్‌లోని అంబియెన్స్ మాల్ సహా చాణక్యపురిలోని ప్రైమస్ ఆసుపత్రికి ఈ మెయిల్ ద్వారా బాబు బెదిరింపులు వచ్చినట్లు పేర్కొన్నారు. కొన్ని గంటల్లో బాంబు పేలుతుందంటూ దుండగులు మెయిల్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు, అగ్నిమాపక బృందాలు ఆయా మాల్స్, ఆసుపత్రి వద్దకు చేరుకొని సోదాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

కలకత్తా హైకోర్టుకు సుప్రీం చీవాట్లు

న్యూఢిల్లీ: కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలంటూ గతేడాది ఓ తీర్పు సందర్భంగా కలకత్తా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఆ వివాదాస్పద తీర్పును కొట్టివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఆ కేసులో నిందితుడికి వేసిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టం చేసింది. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకుగానూ బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తికి కింది కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ వ్యక్తి కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. గతేడాది అక్టోబరులో దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం... సంచలన తీర్పు వెలువరించింది. బాలిక అతడితో ఇష్టపూర్వకంగానే సాన్నిహిత్యం కొనసాగించిందన్న కారణంతో అతడిని నిర్దోషిగా ప్రకటించింది. ఆ సందర్భంగా న్యాయస్థానం కొన్ని సూచనలు చేసింది. 'కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందం కోసం చూసుకుంటే... సమాజం దృష్టిలో బాలికలు పరాజితులుగా మిగిలిపోతారు. కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలు నియంత్రించుకోవాలి' అని సూచించింది. దీనిపై అప్పట్లో పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ సూచనలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మరోవైపు, నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసింది. వీటిపై గతంలో విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కోర్టు సూచనలపై అసహనం వ్యక్తంచేసింది. న్యాయమూర్తులు తీర్పుల్లో ప్రవచనాలు చెప్పరాదని పేర్కొంది. ఈ క్రమంలోనే తాజాగా దీనిపై తీర్పు వెలువరించింది. నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. అతడి శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించింది. కోర్టులు తీర్పులు ఎలా రాయాలన్న దానిపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది.

ఆర్‌జీ కార్ మాజీ ప్రిన్సిపల్‌కు బిగుస్తున్న ఉచ్చు

కోల్‌కతా: కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన సంచలనంగా మారింది. ఈ ఘటన నేపథ్యంలో వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. హత్యాచార ఘటన నేపథ్యంలో ఆయన ప్రిన్సిపల్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వైద్యురాలి ఘటనలో ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆసుపత్రికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కోల్‌కతా పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై బెంగాల్ ప్రభుత్వం ఇప్పటికే స్పందించి... కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది. ఈ సిట్‌కు అధిపతిగా ఐజీ ప్రణవ్ కుమార్‌ను నియమించింది. నెలలోగా తొలి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విచారణకు అవసరమైన డాక్యుమెంట్లను సిట్ బృందానికి సమర్పించి, విచారణకు సహకరించాలంటూ ప్రభుత్వం వివిధ విభాగాలకు నోట్ పంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు, వైద్యురాలి హత్యాచారం కేసులో సందీప్ ఘోష్‌ను సీబీఐ అధికారులు నాలుగు రోజులుగా విచారిస్తున్న విషయం తెలిసిందే.

నిందితుడిని ఉరి తీయండి

సంజయ్‌రాయ్ అత్త

కోల్‌కతా: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనలో నిందితుడైన సంజయ్ రాయ్ జీవితంలోని మరో కోణం వెలుగులోకి వచ్చింది. అతడికి, భార్యకు మధ్య సత్సంబంధాలు లేవని స్వయంగా అత్త దుర్గాదేవి వెల్లడించారు. కొంతకాలం క్రితం అతడు భార్యపై చేయి చేసుకోవడంతో ఆమెకు గర్భస్రావమైనట్లు తెలిపారు. అతడు మంచివాడు కాదని చెప్పారు. అతణ్ని ఏం చేసినా ఫర్వాలేదని, ఉరితీసినా సరేనని వ్యాఖ్యానించారు. అతడు చేసిన నేరం గురించి మాత్రం తాను మాట్లాడలేనని దుర్గాదేవి అన్నారు. అంతటి నేరానికి పాల్పడే శక్తి అతడి ఒక్కడికి మాత్రం లేదని అభిప్రాయపడ్డారు. మరికొంత మంది ఉండి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. 'అతడితో మాకు సత్సంబంధాలు లేవు. నా కూతురితో అతడికి పెళ్లయి రెండేళ్లు అవుతోంది. అతడికి నా కూతురు రెండో భార్య. వివాహమైన తొలి ఆరు నెలలు అంతా సవ్యంగానే సాగింది. గర్భం దాల్చినట్లు నిర్ధారణ కాగానే క్రమంగా గొడవలు ప్రారంభమయ్యాయి. మూడు నెలల గర్భంతో ఉన్నప్పుడు నా కూతురిపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమెకు గర్భస్రావమైంది. పోలీసులకు ఫిర్యాదు చేశాం. అప్పటి నుంచి నా కూతురు అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. వైద్య ఖర్చులన్నీ నేనే భరిస్తున్నా' అని సంజయ్ రాయ్ గురించి దుర్గాదేవి మీడియాకు వివరించారు.

కొండచరియలు విరిగిపడి విద్యుత్ కేంద్రం ధ్వంసం

గువహతి: సిక్కింలో భారీ ప్రమాదం జరిగింది. తీస్తా నదికి చెందిన స్టేజ్ 5 డ్యామ్ ధ్వంసమైంది. మంగళవారం ఆ పవర్ స్టేషన్ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్‌కు చెందిన ఆ ప్లాంట్... కొండచరియల దెబ్బకు పూర్తిగా దెబ్బతిన్నది. 510 మెగావాట్ల పవర్ స్టేషన్ సమీపంలో ఉన్న మట్టి చరియలు ఒక్కసారిగా ఊడిపడ్డాయి. కొన్ని వారాల నుంచి అక్కడ అడపాదడపా స్వల్ప స్థాయిలో కొండచరియలు విరిగిపడుతున్నాయి. అయితే మంగళవారం ఉదయం... ఆ కొండకు చెందిన భారీ చరియలు కిందకు జారిపడ్డాయి. పవర్ స్టేషన్ మొత్తం ఆ శిథిలాల్లో చిక్కుకున్నది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే తరుచుగా కొండచరియలు విరిగిపడుతున్నందున కొన్ని రోజుల క్రితం ఆ స్టేషన్ నుంచి జనాలను తరలించేశారు. పవర్‌స్టేషన్ వద్ద పనిచేస్తున్న కొందరు... కొండచరియలు విరిగిపడే సమయంలో వీడియో తీశారు. ప్రస్తుతం స్టేజ్ 5 డ్యామ్ పనిచేయడం లేదు. గత ఏడాది అక్టోబర్‌లో లోనాక్ గ్లేసియల్ లేక్ వద్ద క్లౌడ్‌బస్ట్ కావడంతో ఆకస్మిక వరదలు వచ్చాయి. ఆ నాటి నుంచి డ్యామ్ పనిచేయడం లేదు. ఆకస్మిక వరదల వల్ల చుంగ్‌తాంగ్ వద్ద తీస్తా డ్యామ్‌కు చెందిన కొన్ని భాగాలు కొట్టుకుపోయాయి. సిక్కింలో ఉన్న అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు ఇదే.

నాన్న... మీ ఆశయాలు నెరవేరుస్తా

రాజీవ్ గాంధీ 80వ జయంతికి రాహుల్ నివాళి

న్యూఢిల్లీ: నాన్న మీ ఆశయాలు నెరవేరుస్తా, భారత్ కోసం మీరు కన్న కలలను నావిగా భావించి సాకారం చేస్తా. మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతా. మీది దయగల మనస్తత్వం, సామరస్యం, సుహృద్భావ వ్యక్తిత్వం' అంటూ తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం 'ఎక్స్'లో భావోద్వేగ పోస్టు పెట్టారు. దేశానికి అతిపిన్న వయస్సుగల ప్రధానిగా 1984 నుంచి 1989 వరకు పదవీ బాధ్యతలను చేపట్టిన రాజీవ్ గాంధీ 1991లో ఎల్‌టీటీఈ ఆత్మాహుతి దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఆయన 80వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని వీర్ భూమి వద్ద రాహుల్ పుష్పాంజలి ఘటించారు.

రాజీవ్ ఆశయాలు గొప్పవి: కాంగ్రెస్

రాజీవ్ గాంధీ ఆశయాలు ఎంతో గొప్పవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'నేడు దేశం సద్భావన దివస్ జరుపుకుంటోంది. రాజీవ్ గాంధీ భారత్ గొప్ప పుత్రుడు. 21వ శతాబ్దానికి నాంది పలుకుతూ అనేక సంస్కరణలు తెచ్చారు. ఓటు వయస్సును 18ఏళ్లకు తగ్గించారు. పంచాయతీ రాజ్, టెలికాం వ్యవస్థలను బలోపేతం, ఐటీ విప్లవం, కంప్యూటీకరణ, శాంతి ఒప్పందాలు, మహిళా సాధికారత, పోలీయో వాక్సినేషన్, కొత్త విద్యా విధానం వంటి సంస్కరణలను తీసుకొచ్చారు. భారత ముఖ చిత్రాన్ని మార్చే ప్రయత్నం చేశారు. భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నాం' అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. జీవితం చిన్నదే అయినా చేసిన పని ఎంతో గొప్పదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. 1985 మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక విధానంలో మార్పునకు రాజీవ్ గాంధీ దోహదమయ్యారని తెలిపారు. 1991 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో కోసం శ్రమించారని, అది మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి మార్గదర్శకత్వం వహించిందన్నారు. రాజీవ్ గాంధీ ముందుచూపుగల నేత అని, ఆయనకు సామాజిక-సాంకేతిక-శాస్త్రీయ పరంగా విజన్ ఉండేదన్నారు. రాజీవ్ గాంధీని కేవలం ప్రధానిగానే కాదు మానవతావాదిగా, స్వచ్ఛమైన మనస్సుగల వ్యక్తిగా గుర్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీకారం తీర్చుకునే మనస్తత్వం ఆయనది కాదన్నారు. ఆత్మస్తుతి ఆయనకు నచ్చదని జైరాం రమేశ్ తెలిపారు. కాంగ్రెస్‌కు మరొక ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా రాజీవ్ ఆశయాలను కొనియాడారు. ఆయన తమకు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో రాజీవ్ గాంధీకి నివాళులర్పించింది.ఆధునిక సాంకేతిక శకానికి, మహిళా-యువత సాధికారతకు కృషి చేసిన ప్రధానిగా... రాజ్యాంగ విలువలకు, లౌకికవాదానికి, ప్రగతిశీల భారత్‌కు, ఐక్యతకు కట్టుబడిన వ్యక్తిగా కొనియాడింది. రాజీవ్ గాంధీ సుసంపన్న, సమ్మిళిత భారత్ కలలు కనేవారని గుర్తుచేసుకుంది. ఆయన ఆశయ సాధనకు కృషిచేస్తున్నట్లు తెలిపింది.

నిరుద్యోగ సమస్య పెంచారు: మాయావతి

లక్నో : దేశంలో 'ధనవంతులు, పేదల మధ్య పెరుగుతున్న విభజన'పై బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఆందోళన వ్యక్తం చేశారు. 'ఉపాధి కొరత'పై కేంద్ర, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాలను నిందించారు. తీవ్ర నిరుద్యోగ సమస్య పరిష్కారానికి డిమాండ్ చేస్తూ మంగళవారం ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'దేశంలో తీవ్రమైన ఉపాధి కొరత మాత్రమే కాకుండా ధనిక, పేదల మధ్య అంతరం పెరుగుతుంది. అంటే సంపద అసాధారణ పంపిణీ ఆర్థిక అసమానత్వాన్ని మరింత దిగజార్చింది. ఈ పరిస్థితి ప్రజలను, దేశం రెండింటినీ ప్రభావితం చేస్తోంది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం' అని మాయావతి 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో హిందీలో పేర్కొన్నారు. 'దేశంలో అభివృద్ధి వాదనలకు అనుగుణంగా తగినంత ఉద్యోగాలు ఎందుకు లేవు? దీనికి ఎవరు బాధ్యులు' అని ప్రశ్నించారు. 'అదే విధంగా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం భారీ ప్రకటనల ద్వారా ఉపాధిలో విజృంభణ ఉందని చెబుతుంది. వాస్తవానికి వారి ఇతర వాదనల మాదిరిగానే క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదు' అని బీఎస్పీ అధినేత్రి అన్నారు. కష్టపడి పనిచేయడం లేదా ఏదైనా స్వయం ఉపాధిని సాధించడం కోసం కేవలం ఒక సాధనగా పరిగణించడం నిరుద్యోగ సమస్య, ఇతర సంబంధిత సమస్యలను పరిష్కరించదని ఆమె అన్నారు. 'సుమారు 250 మిలియన్ల జనాభా ఉన్న ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రంలో 6,50,000 పైగా ప్రభుత్వ ఉద్యోగాల వాదన సముద్రంలో చుక్క కాదా?' అని ఆమె నిలదీశారు. అదేవిధంగా కేంద్ర స్థాయిలో పర్మినెంట్ ఉద్యోగాల పరిస్థితి చాలా భయంకరంగా ఉందని, చాలా స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు.

పేదలు... దళితుల పక్షపాతిని

బీజేపీ నాపై నిరాధార ఆరోపణలు చేస్తోంది: సిద్ధరామయ్య

బెంగళూరు : తాను ఎప్పుడూ పేదలు, దళితుల పక్షపాతిగా, సామాజిక న్యాయం కోసం పాటుపడుతున్నందున బీజేపీ తనపై నిరాధార ఆరోపణలు చేస్తోందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం ఆరోపించారు. అవినీతి ఆరోపణలపై 2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత-2023లోని సెక్షన్ 218 ప్రకారం, అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ కింద ఆయనపై దర్యాప్తు, విచారణకు అనుమతినిస్తూ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అనుమతిని మంజూరు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి దివంగత దేవరాజ్ ఉర్స్ జయంతి సందర్భంగా వారికి నివాళులర్పించే కార్యక్రమంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ పేదలు, వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలతో బీజేపీ ఉండటం అసాధ్యమని అన్నారు. 'కాంగ్రెస్ ఎల్లప్పుడూ మహిళలకు, పేదలకు, మైనారిటీలకు, దళితులకు అనుకూలమైనది. సమాజంలోని అసమానతలకు నేను వ్యతిరేకిని, పేదల పక్షపాతిని అయినందునే బీజేపీ నాపై నిరాధార ఆరోపణలు చేస్తోంది' అని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి అన్నారు. పేదలు ఎప్పుడూ అదే స్థితిలో ఉండాలని, సామాజికంగా, ఆర్థికంగా బలపడకూడదని బీజేపీ ఎప్పుడూ కోరుకుంటోందని సిద్ధరామయ్య ఆరోపించారు. 'ప్రధాని నరేంద్ర మోదీ 'సబ్కా సాత్, సబ్కా వికాస్' (అందరితో కలిసి, అందరి అభివృద్ధి) అన్నారు. కానీ నిజం ఏమిటంటే, అతనికి ఇది 'సబ్కా సాత్, సబ్కా వినాష్' (అందరితో కలిపి, అందరినీ నాశనం చేస్తుంది)' అని విమర్శించారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ద్వారా స్థలాల కేటాయింపులో అవకతవకలకు సంబంధించిన ఆరోపణలను సిద్ధరామయ్య 'నిరాధారమైనవి' గా అభివర్ణించారు.

సిద్ధరామయ్యపై బీజేపీ కుట్ర

డీకే శివకుమార్ విమర్శ

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరాయమ్య లక్ష్యంగా మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణం పేరుతో బీజేపీ కుట్రకు తెర తీసిందని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్యను దింపడమే లక్ష్యంగా కమలం పార్టీ పని చేస్తోందని మండిపడ్డారు. ముడా కుంభకోణంతో సిద్ధరామయ్యకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ముఖ్యమంత్రి అమాయకుడని శివకుమార్ స్పష్టం చేశారు. సిద్ధరామయ్యకు కాంగ్రెస్ పార్టీ నూటికి నూరు శాతం మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే... పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు అంతా సిద్ధరామయ్య వెంట ఉన్నారన్నారు. డీకే శివకుమార్ మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. సీఎం పదవికి సిద్ధూ రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ముడా కుంభకోణం అంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలన్నీ అబద్ధాలన్నారు. సిద్ధరామయ్య తప్పు చేసినట్లు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. మరోవైపు తాను ముఖ్యమంత్రి పదవి కోసం తాపత్రయపడుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. అయినా ఈ విషయం పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. ఇంకోవైపు ఈ వ్యవహారంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు డీకే శివకుమార్ లేఖ రాశారు. సిద్ధరామయ్యను ప్రాసిక్యూషన్ చేయాలంటూ గవర్నర్ ఆదేశాలు జారీ చేసిన అంశంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతికి శివకుమార్ సూచించారు.

హర్యానా ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్

బబితపై వినేశ్ పోటీ?

చండీగఢ్: అధిక బరువు కారణంగా అనర్హత వేటు పడటంతో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఒలింపిక్స్ కల చెదిరింది. అనంతరం భారమైన హృదయంతో కుస్తీకి వీడ్కోలు పలికింది. దీంతో ఆమె భవిష్యత్తు ప్రయాణం ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారంటూ తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. తన సోదరి బబిత ఫొగాట్‌పై ఆమెను నిలబెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. 'అవును... ఆమె రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ వర్సెస్ బబితా ఫొగాట్ పోటీ ఉండొచ్చు. రాజకీయాల్లోకి రాబోనని గతంలో ఆమె ప్రకటించింది. అయితే, ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ఆమెను సంప్రదించి సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏ పార్టీలో చేరనున్నారనేది మాత్రం ప్రస్తుతానికి స్పష్టత లేదు' అని ఫొగాట్ కుటుంబానికి అత్యంత సన్నిహిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి. మరో రెజ్లర్ బజ్‌రంగ్ పునియా కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలిపాయి. ఇటీవల వినేశ్ ఫొగాట్ స్వదేశానికి చేరుకున్న సమయంలో... విమానాశ్రయం వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా ఆమెను సాదరంగా స్వాగతించారు. గతంలోనూ దీపిందర్ హుడా మాట్లాడుతూ వినేశ్‌ను రాజ్యసభకు పంపాలనే అభిప్రాయం వ్యక్తంచేశారు. దీంతో ఆమె కాంగ్రెస్‌లో చేరొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గత హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా 2019లో బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో దాద్రి స్థానం నుంచి పోటీ చేసిన ఆమె... ఓటమిపాలయ్యారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ తాజా కథనాలు నిజమైతే... ఈసారి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్ పోరు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారనుంది. హర్యానాలో అక్టోబరు 1వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

సుస్థిర ఆర్థిక వృద్ధే లక్ష్యం: శక్తికాంత దాస్

న్యూదిల్లీ: కోవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్ యుద్ధం, అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ భారత్ ప్రశంసనీయమైన వృద్ధిని సాధించగలిగిందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. గత ఐదు, ఆరేళ్లుగా అస్థిర పరిస్థితులు ఉన్నా యని, ఈ ఆర్థిక సంవత్సరంలో 7.2శాతం వృద్ధిని ఆశిస్తున్నట్లు తెలిపారు. సుస్థిర వృద్ధిని అంచనా వేసినట్లు చెప్పారు. కోవిడ్ దశలవారీ విజృంభణ, ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపం దాల్చడం వల్ల అనేక సవాళ్లు ఎదురైనట్లు ఓ ప్రముఖ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. కోవిడ్ సంక్షోభం వల్ల ప్రపంచంలోని ప్రతి ఆర్థిక వ్యవస్థ నష్టాల్లోకి వెళ్లిందన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకు అవుట్‌పుట్ నష్టం భర్తీ చేయలేనిదిగా ఉందని చెప్పారు. సంక్షోభాన్ని అధిగ మించిన తీరు ప్రశంసనీయమన్నారు. దేశం మరింత పటిష్ఠమైన ఆర్థికపరమైన స్థితికి చేరుకుతుందని అన్నారు. సంక్షోభ పరిస్థితుల్లో నిలద్రొక్కుకోవడం కోసం 100కుపైగా చర్యలను రిజర్వు బ్యాంకు తీసుకుందని, ప్రభుత్వంలో సమన్వయం చేసుకుందని ఆయన చెప్పారు.

‘వేదవతి’కి రూ.200 కోట్లు

చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: వేదవతి ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం లేఖ రాశారు. కరువు పీడిత ప్రాంతమైన కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి వేదవతి ఎత్తిపోతల పథకం వరదాయిని అన్నారు. ఆలూరు, హాలహర్వి, హోలగుండ, చిప్పగిరి, ఆదోని, కౌతాలం మండలాల్లోని 80 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని, 253 గ్రామాలు, రెండు మున్సిపాలిటీల్లోని 10 లక్షల మంది జనాభాకు తాగునీరు అందించే సదుద్దేశంతో 2019 జనవరిలో ముఖ్యమంత్రిగా మీరు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని రామకృష్ణ గుర్తు చేశారు. హాలహర్వి-ఆలూరు మధ్య 4.25 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఒక జలాశయం, మొలగవల్లి వద్ద మరో 4 టీఎంసీల సామర్థ్యంతో రెండో జలాశయాన్ని నిర్మించి తాగు, సాగునీరిచ్చేందుకు నాటి టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. వేదవతిలో నీరు తక్కువగా ఉంటే హంద్రీనీవా ద్వారా తరలించేలా పైపులను సిద్ధం చేశారని, 54 ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో వేదవతిని చేర్చి... టెండర్లు పిలిచి పనులు అప్పగించారని తెలిపారు. తదనంతర కాలంలో ఏర్పడిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు సామర్థ్యాన్ని సగానికంటే తక్కువకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. 8.4 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలనుకున్న వేదవతిని 3 టీఎంసీలకు తగ్గించిందన్నారు. దీనిపై రైతుల నుండి తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైనా ఏమాత్రం పట్టించు కోలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని వివరించారు. నీళ్లొస్తే తమ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని ఎదురు చూస్తున్న రైతుల ఆశలను వైసీపీ ప్రభుత్వం అడియాసలు చేసిందని విమర్శించారు. వేదవతి ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లున్నాయని, ఆ నీటి వినియోగానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలో కాలువలు నిర్మించడం ద్వారా పత్తికొండ, ఆలూరు, గుంతకల్లు నియోజకవర్గాలకు సాగునీరు, తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఎన్ఎల్‌సీ ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీరు, తాగునీరు అందించడానికి ఉపయోగపడే ఈ ప్రాజెక్టు కోసం ఆ ప్రాంత ప్రజలు, రైతులు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్లు నిధులు కేటాయించి, ఈ ప్రాజెక్టును మూడేళ్లలోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలకు హమాలీలు తరలి రావాలి

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖపట్నంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల్లో చివరి రోజు 3వ తేదీ జరిగే ర్యాలీలో బ్రేవరేజెస్ కార్పొరేషన్‌కి చెందిన హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. మంగళవారం ఏపీఎస్ బీసీఎల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక గొల్లపూడిలో జోస్యభట్ల సత్యనారాయణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ హమాలీలకు బీమా, యూనిఫామ్ లాంటి సౌకర్యాలను ఏపీ బీసీఎల్ హమాలీ సంఘం పోరాడి సాధించిందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం తరపున రావలసిన బకాయిలు, నూతన అగ్రిమెంటు, నూతన మద్యం పాలసీపై మన వైఖరి స్పష్టంగా తెలియజేస్తామని చెప్పారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించి ప్రసంగించారు. కార్మికులు ఎగుమతి కూలీల సమస్యపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి లోకేశ్వరరావు మాట్లాడుతూ హమాలీల కోసం నిరంతరం ఉద్యమించే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలకు హాజరుకావాలని, దేశం నలుమూలల జాతీయ నాయకులు ప్రతినిధులు హాజరవుతారని వారందరికీ వసతి భోజనం ఏర్పాట్ల కోసం యూనియన్‌గా తన వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఎస్ బీసీఎల్ హమాలీ వర్కర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అప్పారావు, దేవర శ్రీను, రాజశేఖర్, శ్రీధర్, పవన్, అప్పారావు పాల్గొన్నారు.

దళితుడికి న్యాయంపై వెనక్కి తగ్గేదేలేదు

రాయ్‌బరేలిలో రాహుల్

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయ్‌బరేలి: ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో హత్యకు గురైన 22 ఏళ్ల దళితుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదు అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన మంగళవారం రాయ్‌బరేలి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాయ్‌బరేలిలో విలేకరులతో మాట్లాడుతూ సూత్రధారిపై ఎస్పీ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆయన నిర్లక్ష్య ధోరణే స్థానికుల ఆగ్రహానికి కారణమని అన్నారు. హత్యకు గురైతే దళితుడికి న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి లేదా అని నిలదీశారు. ‘అతని తల్లితో మాట్లాడాను. అతను మంగలి పని చేసేవాడని ఆమె చెప్పారు. సెలూన్‌కు రోజుకు ఆరు, ఏడుగురు వచ్చి డబ్బు ఇవ్వకుండా వెళ్లిపోయేవారని తెలిపారు. మళ్లీ సెలూన్‌కు వచ్చినప్పుడు డబ్బులివ్వాలని నిలదీయడంతో అతని సోదరుడిని హత్య చేశారని చెప్పారు’ అని రాహుల్ తెలిపారు. ఇది తీవ్ర అన్యాయమని అన్నారు. ఎలాంటి శిక్ష విధించాలన్నది కోర్టు నిర్ణయిస్తుంది కానీ నేను అందుకు ఒత్తిడి చేయగలను, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రాహుల్ స్పష్టంచేశారు. కాగా, ఈనెల 11న అర్జున్ పాసిని కొందరు స్థానికులు అతని సెలూన్ వద్ద కాల్చి చంపారు. ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురు అరెస్టు అయ్యారు.

నేడు జమ్మూకశ్మీర్‌కు ఖర్గే, రాహుల్

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాజకీయ పార్టీలు హడావుడి ప్రారంభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలే కాకుండా జాతీయ పార్టీలు సైతం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా ఈ నెల 21, 22 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. జమ్మూ, శ్రీనగర్‌లోని పార్టీ కీలక నేతలతోపాటు పార్టీ శ్రేణులతో వారు భేటీ కానున్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఎక్స్ వేదికగా వివరించారు. బుధవారం మధ్యాహ్నం ఖర్గే, రాహుల్ జమ్మూ చేరుకుంటారు. అక్కడ పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. తర్వాత శ్రీనగర్ చేరుకుని పార్టీ కీలక నేతలతో భేటీ కానున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఇతర పార్టీలతో కాంగ్రెస్ జత కట్టే అవకాశముందని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. అధికారంలోకి రాకుండా బీజేపీని నియంత్రించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు నాలుగు రాష్ట్రాలు... హర్యానా, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్, జార్ఖండ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులతో సోమవారం న్యూదిల్లీలో ఖర్గే, రాహుల్ సమావేశమైన సంగతి తెలిసిందే. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మూడు విడతల్లో జరుగుతుంది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. ఈ నేపథ్యంలో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలే కాకుండా... ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు సైతం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాయి. ఇంకోవైపు బీజేపీ అగ్రనేతలు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం జమ్మూ కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు.

విదేశాలకు జగన్, విజయసాయి

అనుమతి కోరుతూ సీబీఐ కోర్టులో వేర్వేరు పిటిషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ విజయసాయి రెడ్డి మంగళవారం వేర్వేరుగా సీబీఐ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విజయసాయి రెడ్డి పిటిషన్‌పై వాదానలు పూర్తి కాగా, తీర్పు ఈనెల 30కి వాయిదా పడింది. జగన్ పిటిషన్‌పై కౌంటరు దాఖలుకు సీబీఐ సమయం కోరడంతో విచారణ బుధవారానికి వాయిదా పడింది. సెప్టెంబరులో బ్రిటన్ వెళ్లేందుకు జగన్ అనుమతి కోరగా, సెప్టెంబరు, అక్టోబరులో యూరప్ వెళ్లేందుకు విజయసాయి రెడ్డి అనుమతి కోరారు.

జగన్ అక్రమాస్తుల కేసు విచారణ 17కి వాయిదా

జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ సెప్టెంబరు 17వ తేదీకి వాయిదా పడింది. జగన్ కేసులపై త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన విచారణ జరపాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు రెండు పక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను జాబితా చేయనున్నట్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు జాబితా చేయాలని ఆదేశించడంతో విచారణను సెప్టెంబరు 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.

విచారణకు జోగి గైర్హాజరు... మళ్లీ నోటీసులు జారీ

మాజీ మంత్రి జోగి రమేశ్ మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు గైర్హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిపై గత ప్రభుత్వ హయాంలో జరిగిన దాడికి సంబంధించిన ఘటనపై ఇప్పటికే ఈ కేసు విచారణను ఓపెన్ చేసిన పోలీసులు గత శుక్రవారం జోగి రమేశ్‌ను మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో గంటన్నర పాటు విచారణ చేశారు. ఆయన ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం జోగిని పోలీసులు ఇంటికి పంపించివేశారు. అయితే మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మరోసారి విచారణకు రావాల్సిందిగా జోగి రమేశ్‌తో పాటు మరికొందరికి పోలీసులు నోటీసులు జారీ చేయగా, జోగి హాజరు కాలేదు. మాజీ మంత్రి తరపున ఆయన న్యాయవాదులు మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జోగి రమేశ్ వ్యక్తిగత కారణాలతో ఈరోజు విచారణకు హాజరు కావడం లేదని తెలియజేశారు. దీంతో పోలీసులు ఆయనకు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఇదే కేసులో ఆయనతో పాటు పాల్గొన్న మరికొందరికి కూడా పోలీసులు నోటీసులు అందజేశారు.

ప్రముఖ రచయిత, సాహితీవేత్త

ముత్యం గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర- హైదరాబాద్: ప్రముఖ రచయిత, సాహిత్య పరిశోధకుడు డా.కె.ముత్యం మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో చనిపోయారు. ఆయన ఆత్మీయ మిత్రుడు... 25 పరిశోధనా గ్రంథాలు వెలువరించిన పరిశోధకుడు...శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యాన్ని పరిశోధించి నేటి తరానికి అందించిన గొప్ప రచయిత. నాలుగున్నర దశాబ్దాల క్రితం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘానికి పీడీఎస్‌యూ తరపున అధ్యక్షుడిగా పనిచేశారు. బెనారస్ యూనివర్సిటీ విద్యార్థి, ప్రముఖ సాహితీవేత్త. ఉత్తరాంధ్రతోపాటు ఉత్తర తెలంగాణ సాహిత్య సాంస్కృతిక పరిశోధక రచయిత. మూడేళ్లుగా ఆయన బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. ఆయన మృతిని తెలుగు రాష్ట్రాల సాహితీవేత్తలు, రచయితలు, సాహిత్య పరిశోధకులు, కళాకారులు, విప్లవ, వామపక్ష, ప్రగతిశీల ఆలోచనాపరులు, ముఖ్యంగా అసంఖ్యాకంగా గల ముత్యం శ్రేయోభిలాషులు, మిత్రులు, సన్నిహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన మృతికి అనేకమంది సంతాపం తెలిపారు.

ఏపీలో హెచ్‌సీఎల్ భారీ విస్తరణ

మంత్రి లోకేశ్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌సీఎల్ ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు సిద్ధమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌సీఎల్ ప్రస్తుతం 4,500 మందికి ఉద్యోగాలు కల్పించింది. ప్రస్తుతం రాష్ట్రంలో భారీఎత్తున విస్తరణ చేపట్టాలని నిర్ణయించినట్లు హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివ శంకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ వెల్లడించారు. హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఏపీలో విస్తరణ ద్వారా మరో 5,500 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వారు మంత్రికి తెలిపారు. ఫేజ్ 2 లో భాగంగా నూతన కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టి మరో పది వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న స్కిల్ సెన్సస్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామని అన్నారు.

విడతల వారీగా రాయితీలు విడుదల చేస్తాం

మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అనేక రాష్ట్రాలు పోటీపడగా, తాను స్వయంగా వెళ్లి హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ శివ్ నాడార్‌తో మాట్లాడి గన్నవరంలో క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పించానని చెప్పారు. రికార్డు టైంలో అనుమతులు, భూ కేటాయింపులు చేసి, యుద్ధ ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభించేలా చేయడం తనకు మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వ అసమర్థత కారణంగా సంస్థ కార్యకలాపాలు ముందుకు సాగలేదన్నారు. 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించాల్సిన సంస్థ కేవలం 4,500 మంది వద్దనే ఆగిపోయిందని అన్నారు. పూర్తి స్థాయి అనుమతులు, రాయితీలు ఇవ్వకుండా నిలిపివేసి ఇబ్బందులు పెట్టారన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్ పెట్టిన రాయితీలను విడతల వారీగా విడుదలకు హామీ ఇస్తూ మరో 15,500 మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని, అందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని మంత్రి లోకేశ్ వారికి హామీ ఇచ్చారు.

విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన

విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులతో కలిసి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. అనంతరం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు మాట్లాడుతూ విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన విద్యార్థులు తరువాత జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత కూడా సాధించారని, ఎన్ఎంసీ నిబంధన ప్రకారం ఏడాది పాటు ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేసినట్లు వివరించారు. వారు శాశ్వత గుర్తింపు పత్రం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఆంధ్ర ప్రదేశ్ వైద్య మండలి (ఏపీఎంసీ) ముందు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు కూడా హాజరయ్యారని తెలిపారు. అయితే రెండు నెలలు గడుస్తున్నా శాశ్వత గుర్తింపు పత్రం జారీ చేయటం లేదని, ఆ ప్రక్రియను ఏపీఎంసీ నిలుపుదల చేసిందన్నారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం శాశ్వత గుర్తింపు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ మాట్లాడుతూ విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన రాష్ట్రానికి చెందిన వేలాది మంది విద్యార్థులు శాశ్వత గుర్తింపు పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. పొరుగు రాష్ట్రాలు కర్నాటక, తెలంగాణతో పాటు దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే శాశ్వత గుర్తింపు పత్రాలు ఇచ్చేశారని తెలిపారు. అయితే మన రాష్ట్రంలో వైద్య మండలి ఏర్పాటు కాలేదంటూ గుర్తింపు పత్రాల జారీని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులు ఇప్పటికే ఒక్కొక్కరు రూ.2 లక్షలు చెల్లించి పీజీ విద్య కోసం ప్రైవేటు శిక్షణా కేంద్రాల్లో చేరారని తెలిపారు. ఆ విద్యార్థులంతా రెండు సంవత్సరాలు ఇంటర్న్‌షిప్ చేయాలంటూ ఇతర రాష్ట్రాలలో లేని నిబంధనను మన రాష్ట్రంలో మాత్రమే పెట్టడంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ వైద్య మండలి ద్వారా శాశ్వత గుర్తింపు పత్రాలు జారీ చేసి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్, నాయకులు సురేష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఉపాధి పనులపై వినతులు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: ఈ నెల 23వ తేదీన 2024-25 సంవత్సరానికి ఉపాధి హామీ పనులను గుర్తించే గ్రామ సభల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నుండి వినతి పత్రాలు సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు సంఘం శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఉపయోగపడే పనులను మాత్రమే గుర్తించాలని, చట్టంలో పొందుపరచిన చాలా పనులు కనుమరుగయ్యాయని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, ఉపాధి కూలీలకు సక్రమంగా వంద రోజులు కూడా పనులు కల్పించడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ పనులపై నమ్మకం లేక రాయలసీమ ప్రాంతంలో విపరీతంగా వరుసలు వెళ్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గ్రామ సభల్లో పనులు గుర్తించాలని పిలుపునివ్వడం శుభ పరిణామం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేవలం గుంతలు తవ్వడంకే పరిమితం కాకుండా, చట్టంలో ఏవైతే పొందుపరిచారో ఆ పనులు చేయించటం ద్వారా ఉపాధి కూలీలకు పనులు దొరుకుతాయని తెలిపారు. పని అడిగిన ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు, రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలని, మజ్జిగ, తాగునీరు, ప్రాథమిక చికిత్సకు అవసరమైన పరికరాలు, గుడారాలు, వేసవి అలవెన్స్ ఇవ్వాలని కోరారు. రెండు పూటలా పని విధానం, ముఖఆధారిత హాజరు తీసివేయాలని, ఉపాధి కూలీలు చేసిన పనికి వేతన బకాయిలు, వంద రోజులు పని పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు పనిముట్లు అందేలా గ్రామసభల్లో జిల్లా కమిటీలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నుండి వినతి పత్రాలు సమర్పించాలని కోరారు. ఉపాధి నిధులను ఇతర మార్గాలకు మళ్లించకుండా కేవలం ఉపాధి కూలీలతో పనులు చేయించేలా చూడాలని, ఎక్కడైతే అవినీతి జరిగిందో దానిని వెలికి తీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. పండ్ల తోటల పెంపకానికి 5 ఎకరాల సీలింగ్‌ను 10 ఎకరాల వరకు పెంచేలా డిమాండ్ చేయాలని సూచించారు.

ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేక రేషన్ కార్డులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి దాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యసాధనకనుగుణంగా అధికా రులు అలసత్వం వీడి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. మంగళ వారం వెలగపూడి సచివాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమంపై అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని, అంధ విద్యార్థులకు ఒకేషనల్, స్కిల్ కోర్సులు ప్రవేశపెట్టాలని చెప్పారు. పాఠశాలలు ప్రారంభించే సమయానికే వారికి పాఠ్య పుస్తకాలు అందించాలని, ట్రాన్స్ జెండర్లు గుర్తింపు కార్డులు తీసుకునేలా అవగాహన కల్పించాలని, టాన్స్ జెండర్లకి ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ట్రాన్స్ జెండర్లతో స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు ప్రోత్సహించాలని, వారికి స్వయం ఉపాధి కల్పించి సమాజంలో గౌరవంగా బతికేలా చర్యలు చేపట్టాలని, దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

అక్కడ... జీవో 610 అమలు చేయాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 610ని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలుచేసి, ఆ ప్రాంతంలోని శెట్టిపల్లి గ్రామ హక్కుదారులకు అవకాశం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. తిరుపతి జిల్లా శెట్టిపల్లి గ్రామంలోని 630 ఎకరాల ఇనాము భూముల్లో రైతులు 100 సంవత్సరాలుగా అనుభవదారులుగా ఉన్నారని, గ్రామం 30 ఎకరాలు, చెరువు 60 ఎకరాలు కలిగి ఉండగా రైల్వే కోచ్ రిపేర్ వర్క్ షాప్ కోసం రైతులు 83 ఎకరాలు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులు 257 ఎకరాలలో వ్యవసాయం చేస్తుండగా, మిగిలిన 200 ఎకరాలు తమ అవసరాల కోసం ప్రజలకు ఇళ్ల స్థలాలుగా రైతులు విక్రయించారని, 3 వేల మంది తిరుపతి వాసులు స్థలాలు కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

రాయితీపై విత్తనాలు: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాయలసీమ జిల్లాల్లో సాగుకు దూరంగా ఉన్న రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందించాలని అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు అదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి రాయలసీమ జిల్లాల్లో వ్యవసాయ పరిస్థితులపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాధార పరిస్థితుల వల్ల రైతుకు ఆదాయం తగ్గకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు. రైతుకు అవసరమైన విత్తనాలకు రాయితీ ఇవ్వాలని చెప్పారు. తక్షణమే ప్రత్యామ్నాయ పంటల వాస్తవ అంచనాలను రూపొందించాలని మంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే మంత్రి అచ్చెనాయుడు సచివాలయంలోని తన ఛాంబర్ లో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రి అచ్చెనాయుడు పేర్కొన్నారు.

ఏడాదిలోపు వారికి బదిలీలు మినహాయించాలి

ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల మార్గదర్శకాల్లో ఏడాదిలోపు పదవీ విరమణం పొందే ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయించాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం కార్యాలయం, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యాలయ అధికారులకు జేఏసీ రాష్ట్ర చైర్మన్, సెక్రటరీ జనరల్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఈ బదిలీల ఉత్తర్వుల్లో ఏడాదిలోపు పదవీ విరమణ చేసే వారికి మినహాయింపు ఇవ్వలేదన్నారు. 62 ఏళ్ల వయస్సులో అనేక జబ్బులతో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న వారు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న స్థానం నుంచి బదిలీ చేస్తే తీవ్ర ఇబ్బందులకు గురవడంతో పాటు వారి పెన్షన్ పేపర్లు ఆరు మాసాలు ముందుగా తయారు చేసుకుని పంపాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం కూడా ఏడాదిలోపు రిటైర్ అయ్యే ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చిందని గుర్తుచేశారు. దీనిపై సీఎం కార్యాలయం, ఆర్థిక శాఖాధికారులు సానుకూలంగా స్పందించారని, ఒకటి రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.